
# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 35, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) గురువారం - 24 - ఏప్రిల్ - 2025


## సినిమాలపై పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం..



★ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజకీయాల్లో బిజీబిజీగా గడుపుతున్నారు.

★ త్వరగా షూటింగ్ పూర్తి చేసే వచ్చే నెలలో రిలీజ్ చేసేందుకు ప్రాణాళికలు సిద్ధం

★ పవన్ కల్యాణ్ నటించాల్సిన పాత్రలు మాత్రమే బ్యాలన్స్ ఉండడంతో ఆయన డేట్స్ కోసం నిర్మాతలు ఎదురుచూస్తున్నారు.

అమరావతి : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజకీయాల్లో బిజీబిజీగా గడుపుతున్నారు.

# అమరావతికి మద్దతివ్వండి

- అమరావతిలో క్వాంటమ్ విలేజ్ దేశంలోనే తొలిసారి
- హైటెక్ సిటీని తలదన్నేలా ఐకానిక్ బిల్డింగ్
- చరిత్రలో నిలిచిపోయేలా నిర్మించడానికి అండగా ఉండండి
- కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- జగన్ హయాంలోని మద్యం కుంభకోణం గురించి ప్రస్తావన?
- కర్నూలులో హైకోర్టు బెంచ్, పోలవరం-బనకచర్లకు సాయం
- అమెరికా సుంకాల నుంచి ఆక్వా రైతులను కాపాడండి
- కేంద్ర మంత్రులకు చంద్రబాబు వినతులు



**అమరావతి**

**రాజధాని నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేసేందుకు కేంద్ర మద్దతు కోరుతూ సీఎం చంద్రబాబు అమిత్ షాతో భేటీ అయ్యారు. జల జీవన్ మిషన్, పోలవరం లింక్ ప్రాజెక్ట్, ఆక్వా రైతుల సమస్యలపై కేంద్ర మంత్రులతో విస్తృతంగా చర్చించారు.**

న్యూఢిల్లీ, : అమరావతిలో రాజధాని నిర్మాణం శరవేగంగా పూర్తిచేసేందుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు అవసరమని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ మే 2న ప్రారంభించనున్న రాజధాని నిర్మాణం చరిత్రలో నిలిచిపోవాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. విదేశీ పర్యటన ముగించుకుని సోమవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్న చంద్రబాబు.. మంగళవారం అమిత్ షాతో పాటు కేంద్ర మంత్రులతో భేటీ అయి రాష్ట్ర ప్రాజెక్టులు, పథకాల గురించి చర్చించారు. 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న

## మద్యం స్కాంలో బిగ్ బాస్ బండారం బయటపెడతాం



- మద్యం స్కాంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన మంత్రి కొల్లు రవీంద్ర
- జగన్ పాలనలో రాష్ట్రాన్ని స్కాములకు కేంద్రంగా మార్చారని ఎద్దేవా
- ఆడబిడ్డల విషయంలో తప్పుడు ప్రచారం చేస్తే ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు.
- దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుంది పేర్ని నాని వ్యవహారమని మంత్రి ఎద్దేవా

## ఉగ్రదాడిపై భారత్‌కు అమెరికా పూర్తి మద్దతు: వాన్స్



★ పహల్గామ్ ఉగ్రదాడిపై ప్రధాని మోదీకి అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ ఫోన్ కాల్

★ దాడిని తీవ్రంగా ఖండించి, మృతులకు సంతాపం తెలిపిన వాన్స్

★ ఉగ్రవాదంపై ఉమ్మడి పోరులో భారత్‌కు అన్ని విధాల సహాయం చేస్తామని అమెరికా హామీ

★ అంతకుముందే మోదీతో ఫోన్లో మాట్లాడిన అధ్యక్షుడు ట్రంప్

★ దాడి సూత్రధారులను కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేసిన ప్రధాని మోదీ

## ఉగ్ర ఘటనపై భారత్ వరుస సమీక్షలు..

# బెంబేలెత్తిపోతున్న పాక్

- భారతదేశం మునుపటిలాగా సరిహద్దు ఉగ్రవాదులను నిర్మూలించడానికి ఒక ప్రచారాన్ని ప్రారంభించగలదని
- ఉగ్రవాదానికి మనం తలొగ్గబోమని ఆయన స్పష్టం
- మోదీ చర్య పాకిస్తాన్ కు ప్రత్యక్ష హెచ్చరికగా భావిస్తున్నారు.
- ముగ్గురు సైన్యాధిపతులు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు.
- అక్కడి పర్యటనను రద్దు చేసుకుని మోదీ వెంటనే భారతదేశానికి తిరిగి వచ్చారు.



ఢిల్లీ: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత కేంద్రప్రభుత్వం అప్రమత్తమైంది. దీంతో భారత్-పాకిస్తాన్ మధ్య ఏదో పెద్ద విషయం జరగబోతోందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. గత 4 గంటల్లో జరిగిన నాలుగు ప్రధాన చర్యల ద్వారా ఈ భయాలు మరింత బలపడ్డాయి. భారతదేశం మునుపటిలాగా సరిహద్దు ఉగ్రవాదులను నిర్మూలించడానికి ఒక ప్రచారాన్ని ప్రారంభించగలదని చెబుతున్నారు. 2016 2019లో ఉగ్రవాద దాడుల తర్వాత మిగతా..2లో

## బార్డర్‌లో వార్ టెన్షన్!

# పహెల్గం ఎటాక్ తర్వాత పాక్ కుయుక్తులు



జమ్మూకశ్మీర్ : జమ్మూకశ్మీర్‌లోని పహెల్గంలో పాకిస్తాన్‌కు చెందిన లష్కరే తోయిబాకు ప్రాక్సీ సంస్థ టీఆర్ఎఫ్ (ది రెసిస్టెన్స్ ఫ్రంట్) ఉగ్రవాదులు సృష్టించిన నరమేధంపై భారతీయులు భగ్గుమంటున్నారు. ఈ ఉగ్రదాడికి బాధ్యులైన వారిని వదిలిపెట్టవద్దని దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దాడిని ఈ ప్రపంచ దేశాలు సైతం ఖండిస్తున్నాయి. ఉగ్రవాదులను పట్టుకునేందుకు భారత భద్రత బలగాలు జమ్మూకశ్మీర్ లోని అన్ని ప్రాంతాలను జల్లెడ పడుతుంటే మరోవైపు పాకిస్తాన్ యుద్ధ సన్నాహాలు చేస్తున్నది. మిగతా..2లో

ఈ ఉగ్రదాడికి బాధ్యులైన వారిని వదిలిపెట్టవద్దని దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

భారత సరిహద్దుల వెంట పాకిస్తాన్ భారీగా సైన్యాన్ని మోహరిస్తోంది.

ఉగ్రవాదులు సృష్టించిన నరమేధంపై భారతీయులు భగ్గుమంటున్నారు.

ఉగ్రవాదులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఈ దాడి వెనుక ఎవరు ఉన్న వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

## వీరయ్య చౌదరి భౌతిక కాయానికి నివాళులు అర్పించిన చంద్రబాబు...

- ఒంగోలులో నిన్న టీడీపీ నేత వీరయ్య చౌదరి హత్య
- నేడు అమ్మనబ్రోలు గ్రామానికి వచ్చిన చంద్రబాబు
- వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులకు పరామర్శ

ఒంగోలులో నిన్న రాత్రి హత్యకు గురైన తెలుగుదేశం పార్టీ నేత వీరయ్య చౌదరి భౌతికకాయానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇవాళ నివాళులర్పించారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు

# హంతకులకు మాస్ వార్నింగ్

మండలం అమ్మనబ్రోలు గ్రామానికి చేరుకున్న సీఎం, వీరయ్య చౌదరి పార్థివదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం, వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వీరయ్య చౌదరి అంత్యక్రియల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారని తెలుస్తోంది. అమ్మనబ్రోలుకు చేరుకున్న ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, ఆనం రామనారాయణ రెడ్డి, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మిగతా..2లో




## బీజేపీ నేత పరువు నష్టం కేసు..

# హైకోర్టు మెట్లెక్కిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి!

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు
- నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో పరువు నష్టం కేసు కొట్టివేయాలని అభ్యర్థన
- ఎన్నికల ప్రసంగంపై బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు వేసిన దావా
- కోర్టు హాజరు నుంచి మినహాయింపు, మధ్యంతర ఉత్తర్వులు కోరిన సీఎం
- పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగే అవకాశం




హైదారాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై నమోదైన పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న ఈ కేసును పూర్తిగా కొట్టివేయాలని ఆయన ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. గత ఏడాది జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేత కాసం వెంకటేశ్వర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తమ పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని ఆరోపిస్తూ ఆయన నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల కోర్టులో పరువు నష్టం దావా వేశారు. బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే

## రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయం : ఎమ్మెల్సీ కవిత



- తెలంగాణ ఉద్యమంలో పెద్దపల్లి జిల్లా కీలకంగా పనిచేసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు.
- ఉద్యమ సమయంలో సింగరేణి సమ్మె చేస్తే ఢిల్లీకి ఉద్యమ సెగ తగిలిందని గుర్తుచేశారు.
- పెద్దపల్లి జిల్లాలో గురువారం పర్యటించిన ఎమ్మెల్సీ కవిత.. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

హైదరాబాద్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 160 నుంచి 170 పార్టీ వచ్చి పోయాయని.. కానీ 25 ఏండ్లుగా నిలబడ్డ ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మిగతా..2లో

## తెలంగాణ భవన్ జనతా గ్యారేజ్‌లా మారింది..

# కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు



- తెలంగాణ భవన్ ఒక జనతా గ్యారేజ్‌లా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.
- బాధితులకు అండగా నిలిచేది గులాబీ జెండా ఒక్కటే అని తెలిపారు.
- వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27వ తేదీన బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను కేటీఆర్ పరిశీలించారు

హైదరాబాద్: అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు

## మద్యం స్కాంలో బిగ్ బాస్

# బండారం బయటపెడతాం

అమరావతి : మద్యం స్కాంలో బిగ్ బాస్ బండారం బయటపెడతామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. జగన్ పాలనలో రాష్ట్రాన్ని స్కాములకు కేంద్రంగా మార్చారని ఆయన మండిపడ్డారు. జగన్ రెడ్డికి అడ్డగోలుగా సహకరించిన వారంతా జైలు పాలవ్వడం తథ్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మద్యం స్కాం వెనుక పెద్ద రాకెట్ ఉందని విజయసాయి బయటపెట్టారని తెలిపారు. స్కాముల్ని కప్పిపుచ్చుకోవడానికే గోవుల మరణాల డ్రామా అని మంత్రి దుయ్యబట్టారు. అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాం:మంత్రి జగన్ పాలనలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని ఒక్కో ఇటుక పేర్చి బాగు చేస్తున్నామన్నారు. వైఎస్సార్సీపీ అరాచకం కారణంగానే అమరావతి, పోలవరం నిర్మాణ వ్యయం అమాంతం పెరిగిందని విమర్శించారు. ఆడబిడ్డల విషయంలో తప్పుడు ప్రచారం చేస్తే ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. దాడులు, హత్యాయత్నాలు చేసినోళ్లకు పదవులిచ్చిన ఘనత జగన్ రెడ్డిదని విమర్శించారు. దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుంది పేర్ని నాని వ్యవహారమని మంత్రి ఎద్దేవా చేశారు. పేదల బియ్యం గురించి ప్రశ్నిస్తే మట్టి దోపిడీ అంటూ హడావుడి చేస్తున్నారన్నారని దుయ్యబట్టారు. మట్టి దోపిడీ ఎవరి హయాంలో జరిగిందో ప్రజల్ని అడిగి తెలుసుకుందామని సవాల్ చేశారు. ఫిషింగ్ హార్బర్, బందరు పోర్టు పనులు ప్రారంభించింది టీడీపీ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమం అజెండాగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. మచిలీపట్నంలో కనీవినీ ఎరుగని అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు. పీ4 కార్యక్రమం ద్వారా మచిలీపట్నంలో పేదరికాన్ని నిర్మూలిస్తానన్నారు. ప్రజాస్వామ్యంలో సంఘ విద్రోహ శక్తులకు స్థానం లేదని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

## సినిమాలపై పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం..

ఈ నేపథ్యంలో ఆయన చేస్తున్న లన్ని వాయిదాల మీద వాయుదాల పడుతున్నాయి. ల్లో పవన్ కల్యాణ్ నటించాల్సిన పాత్రలు మాత్రమే బ్యాలన్స్ ఉండడంతో ఆయన డేట్స్ కోసం నిర్మాతలు ఎదురుచూస్తున్నారు. ఆయన ఎప్పుడు ఫ్రీ అవుతారో.. ఎప్పుడు వచ్చి షూటింగ్ పూర్తి చేస్తారో అని ఎదురు చూస్తున్నారు. అయితే తాజాగా తాను చేయబోయే నిర్మాతలు ఏఎం రత్నం, మైత్రీ మూవీ మేకర్స్, డీవీవీ దానయ్యతో పవన్ కల్యాణ్ సమావేశం అయ్యారు. వీలైనంత త్వరగా పెండింగ్‌లో ఉన్న ల షూటింగ్ పూర్తి చేస్తానని నిర్మాతలకు పవన్ కల్యాణ్ చెప్పినట్టు తెలుస్తోంది. అయితే పవన్ కల్యాణ్ మొదటగా హరిహర వీరమల్లు షూటింగ్ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. త్వరగా షూటింగ్ పూర్తి చేసే వచ్చే నెలలో రిలీజ్ చేసేందుకు ప్రాణాళికలు సిద్ధం చేసుకున్నట్టు సమాచారం. అయితే ఈ హరిహర వీరమల్లు కరోనా ముందు మొదలు కాగా ఇప్పటి వరకు చాలా సార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఫస్ట్ ఈ ను పూర్తి చేసి మిగతా ల షూటింగ్ స్టార్ట్ చేయాలని పవన్ ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే కాకుండా పవన్ ఇంకా రెండు ల షూటింగ్ పూర్తి చేయాల్సి ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో వస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్‌తో పాటు, ఓజీ షూటింగ్ కూడా పవన్ పూర్తి చేయాల్సి ఉంది. కాబట్టి వారికి కూడా జులై నుంచి డేట్స్ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. అయితే ఉస్తాద్ భగత్ సింగ్ తర్వాత ఆయన లకు గుడ్‌బై చెప్పే అవకాశం ఉంది.

## బీజేపీ నేత పరువు నష్టం కేసు..

## హైకోర్టు మెట్లెక్కిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి!

రేవంత్ రెడ్డి ఆ సభలో అన్నారని వెంకటేశ్వర్లు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ప్రజాప్రతినిధుల కోర్టు, కేసు విచారణ ప్రక్రియను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే కొందరు సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసింది. రేవంత్ రెడ్డి ప్రసంగానికి సంబంధించిన ఆడియో, వీడియో క్లిప్పింగులను కూడా కాసం వెంకటేశ్వర్లు కోర్టుకు సమర్పించారు. ఈ నేపథ్యంలో, ప్రజాప్రతినిధుల కోర్టులో కొనసాగుతున్న విచారణను నిలిపివేయాలని, తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు విచారణపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని, అలాగే తనకు కోర్టుకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కూడా ఆయన తన పిటిషన్‌లో అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది.

## వీరయ్య చౌదరి భౌతిక కాయానికి నివాళులు

## అర్పించిన చంద్రబాబు... హంతకులకు మాస్ వార్నింగ్

పలువురు శాసనసభ్యులు, ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు. వారు కూడా వీరయ్య చౌదరి భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, వీరయ్య చౌదరిని దారుణంగా హతమార్చారని వెల్లడించారు. కరడుగట్టిన నేరస్తుల కంటే దారుణంగా హత్య చేశారని, 53 చోట్ల కత్తిపోట్లు ఉన్నాయంటే ఎలా చంపారో అర్థం చేసుకోవచ్చని అన్నారు. వారు భూమ్మీద ఉండేందుకు అనర్హులు... వారిని ఎట్టి పరిస్థితుల్లోనైనా పట్టుకుని తీరుతామని స్పష్టం చేశారు. ఇంత ఘోరానికి పాల్పడిన వ్యక్తులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని, తద్వారా వీరయ్య చౌదరి ఆత్మకు శాంతి కలిగేలా చేస్తామని చెప్పారు. వీరయ్య చౌదరి ఎంతో సమర్థుడైన నాయకుడని, పార్టీకి ఎన్నో సేవలు అందించారని చంద్రబాబు కొనియాడారు. లోకేశ్ తో పాటు పాదయాత్రలో 100 రోజుల పాటు తిరిగాడని గుర్తు చేసుకున్నారు. ఎవరికి కష్టం వచ్చినా ఆదుకునే వ్యక్తి... పిలిస్తే పలికే నేత వీరయ్య... ఇలాంటి వ్యక్తిని చంపేశారని, నిందితులను వదిలిపెట్టే ప్రశ్నే లేదని పునరుద్ఘాటించారు. నిందితులు ఎంత తెలివైనవాళ్లు అయినా ఎక్కడో ఒక చోట క్లూస్ వదిలిపెడతారని, వారు ఎక్కడున్నా గాలించి పట్టుకుంటామని అన్నారు. హంతకుల కోసం 12 బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు. ఈ మండలంలో టీడీపీకి 10 వేల ఓట్ల మెజారిటీ వచ్చిందంటే వీరయ్య చౌదరి సత్తా ఏంటో అర్థమవుతుందని అన్నారు. ఇటువంటి మంచి నాయకుడ్ని కోల్పోవడం బాధ కలుగుతుందని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలో ఉండి కూడా ఇలాంటి ఘోరాలు జరుగుతుండడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి హత్యా రాజకీయాలు చేసే వ్యక్తులకు ఒకటే హెచ్చరిక... మీరు కూడా కాలగర్భంలో కలిసిపోతారు జాగ్రత్త అంటూ వార్నింగ్ ఇచ్చారు. కార్యకర్తలు భయపడ్డొదని, ఓ కుటుంబ పెద్దగా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నేర రాజకీయాలు చేసే పరిస్థితి కనిపిస్తోందని, అలాంటి వారిని అందరినీ తుదముట్టించే వరకు ఈ పోరాటం ఆగదని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఉగ్రదాడిపై భారత్‌కు అమెరికా పూర్తి మద్దతు: వాన్స్

ఢిల్లీ : జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని అమెరికా తీవ్రంగా ఖండించింది. భారత పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ బుధవారం మధ్యాహ్నం ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. ఈ హేయమైన దాడి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన వాన్స్, ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించడానికి అమెరికా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రస్తుతం ఆగ్రాలో ఉన్న వాన్స్.. ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడుతూ, పహల్గామ్ దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో భారత ప్రజలకు అమెరికా అండగా నిలుస్తుందని పునరుద్ఘాటించారు. ఉగ్రవాదంపై ఉమ్మడి పోరులో అవసరమైన పూర్తి సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు వాన్స్‌ల మద్దతు, సంఘీభావ సందేశాలకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపినట్లు విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. అంతకుముందు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ప్రధాని మోదీకి ఫోన్ చేసి పహల్గామ్ దాడిపై సంతాపం తెలిపారు. అమాయక ప్రజల ప్రాణాలు తీసిన ఈ దాడిని తీవ్రంగా ఖండించిన ట్రంప్, సూత్రధారులను చట్టం ముందు నిలబెట్టడంలో భారత్‌కు పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఉగ్రవాదంపై పోరులో భారత్, అమెరికా కలిసి నిలుస్తాయని ఉద్ఘాటించారు. ఈ పిరికిపంద చర్యకు పాల్పడిన వారిని, దాని వెనుక ఉన్న శక్తులను కఠినంగా శిక్షించడానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడికి స్పష్టం చేసినట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

## భూభారతి చట్టం... ప్రజలకు చుట్టం

యాదాద్రి, వలిగొండ, : భూ భారతి చట్టం.. ప్రజలకు చుట్టం అని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీవాసరెడ్డి అన్నారు. మంగళవారం వలిగొండలో భూభారతి(ఆర్‌వోఆర్) చట్టంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించేందుకు అధికారులే ప్రజల వద్దకు వస్తారని.. భూములున్న ఆసాములు, రైతులు తమ భూమి భద్రంగా ఉందని గుండెపై చేయి వేసుకుని నిద్దురపోవాలన్న లక్ష్యంతో భూభారతి రూపొందించామన్నారు. రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నామని, ఒక్క రూపాయి ఫీజు లేకుండా భూ సమస్యలను పరిష్కరిస్తామని.., అధికారులనే క్షేత్రస్థాయికి పంపిస్తున్నామన్నారు. నెలాఖరులోగా నాలుగు మండలాల్లో అన్ని వివరాలు సేకరించి, జూన్ 2న పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నా రు. మే1వ తేదీ నుంచి మరో 28 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుని భూభారతిని అమలు చేస్తామన్నారు. పైలెట్ మండలాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యల పరిష్కారంకోసం ఏమైనా సూచనలు వస్తే నియమనిబంధనల్లో మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. గత ప్రభుత్వం అనాలోచనతో 2020 ధరణి చట్టాన్ని తీసుకొచ్చి... ప్రజలకు అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ధరణి చట్టాన్ని తీసుకొచ్చిన మూడేళ్ల వరకు నియమ నిబంధనలు రూపొందించలేదని... విధివిధానాలు స్పష్టంగా తెలియజేయలేదని.. కేసీఆర్ నోట ఏది వస్తే ఆ మాట ప్రకారమే నడుచుకుందన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల నుంచి విముక్తి చేసేందుకు ఇందిరమ్మ రాజ్యంలో 2025లో భూభారతి చట్టాన్ని తెచ్చామన్నారు. ఏ చట్టమైన ప్రజలకు చుట్టంలాగా, భద్రత కల్పించేలా ఉండాలే తప్ప ప్రజలకు శాపంగా మారకూడదన్నారు.

ధరణితో భూములను లాక్కున్న వారిపై చర్యలు

ధరణి పేరుతో భూములు లాక్కున్న వారిపై చర్య లు ఉంటాయని, రాష్ట్రంలో అన్ని రెవెన్యూ గ్రామాలకు అధికారులను నియమిస్తామని మంత్రి తెలిపారు. మే10వ తేదీలోగా సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలే మండలాలకు వస్తారని తెలిపారు. గ్రామాల్లో భూదాన్, వక్ఫ్, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం ఈ చట్టంలో ఉందని, ఇందుకు సంబంధించిన సమాచారం రెవెన్యూ మంత్రి, కార్యదర్శి వద్దే ఉంటుందన్నారు. అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా తప్పులు చేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సాదాబైనామాలన కింద ఆన్‌లైన్‌లో ఉన్నటువంటి అర్హత గల దరఖాస్తులను పరిష్కరిస్తామన్నారు. మే నెల నుంచి ఇళ్లను ప్రారంభించేందుకు ప్రోసిడింగ్స్ అందిస్తామన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నా ప్రభుత్వం రైతుభరోసా, రుణమాఫీ, మహాలక్ష్మి, సబ్సిడీగ్యాస్, సన్నబియ్యం పంపిణీ, ఆరోగ్యశ్రీ, రాజీవ్ యువ వికాసం, తదితర పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు.

# ఉగ్ర ఘటనపై భారత్ వరుస సమీక్షలు.. బెంబేలెత్తిపోతున్న పాక్

మొదటి పేజి తరువాయి



భారతదేశం సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించింది. రెండు సర్జికల్ దాడుల్లో 500 మందికి పైగా పాకిస్తాన్ ఉగ్రవాదులు హతమయ్యారు.

1. హెూం మంత్రి షా ఉన్నత స్థాయి సమావేశం

ఉగ్రవాద దాడి జరిగిన వెంటనే కేంద్ర హెూంమంత్రి అమిత్ షా కశ్మీర్ లోయకు చేరుకున్నారు. అమిత్ షా స్వయంగా మొత్తం విషయాన్ని పరిశీలిస్తున్నారు. కాశ్మీర్‌లో, అమిత్ షా మనోజ్ సిన్హా, సీనియర్ ఆర్మీ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశం తరువాత, ఎవరినీ వదిలిపెట్టబోమని అమిత్ షా హెచ్చరించారు. ఉగ్రవాదానికి మనం తలొగ్గబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ సంఘటన స్థలాన్ని అమిత్ షా స్వయంగా పరిశీలించారు. లోయ వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తదుపరి వ్యూహాన్ని సిద్ధం చేస్తామని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా చెబుతున్నారు.

2. ప్రధాని మోదీ సౌదీ పర్యటన రద్దు

పహల్గామ్‌లో ఉగ్రవాద దాడి జరిగినప్పుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ సమయంలో సౌదీలో ఉన్నారు. అక్కడి పర్యటనను రద్దు చేసుకుని మోదీ వెంటనే భారతదేశానికి తిరిగి వచ్చారు. నివేదిక ప్రకారం, ప్రధాని పాకిస్తాన్ గగనతలం ద్వారా కాకుండా వేరే మార్గం ద్వారా ఢిల్లీకి వచ్చారు. మోదీ చర్య పాకిస్తాన్ కు ప్రత్యక్ష హెచ్చరికగా భావిస్తున్నారు. ప్రధానమంత్రి ఢిల్లీలో భద్రతపై కేబినెట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. భద్రతపై కేబినెట్ కమిటీ అత్యున్నత స్థాయి కమిటీ. ఇందులో భద్రతకు సంబంధించిన ప్రధాన నిర్ణయాలు తీసుకున్నారు.

3. త్రివిధ దళాలతో రక్షణ మంత్రి భేటీ

పహల్గామ్ సంఘటన తర్వాత, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్రివిధ సైన్యాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో, ముగ్గురు సైన్యాధిపతులు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. దీని అర్థం ప్రభుత్వం తదుపరి చర్య కోసం ఏ నిర్ణయం తీసుకున్నా, దానిని సులభంగా అనుసరించవచ్చు. చివరిసారిగా పాకిస్తాన్‌లో వైమానిక దళం సర్జికల్ స్ట్రైక్ నిర్వహించింది. వైమానిక దళ కమాండర్ పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోకి ప్రవేశించి రెండు వేర్వేరు సర్జికల్ స్ట్రైక్స్‌లో 500 మందికి పైగా ఉగ్రవాదులను హతమార్చారు.

4. పాకిస్తాన్‌లో భయానక వాతావరణం

పాకిస్తాన్‌లో భయానక వాతావరణం నెలకొంది. భారతదేశం దాడి చేస్తే, ఇక్కడి అన్ని పార్టీలు కలిసి దానిని వ్యతిరేకిస్తాయని పాకిస్తాన్ మాజీ విదేశాంగ మంత్రి చౌదరి ఫవాద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫవాద్ కంటే ముందు, పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఈ దాడిలో పాకిస్తాన్ పాత్ర లేదని అన్నారు. ఉపగ్రహ నివేదిక ప్రకారం, పాకిస్తాన్ వైమానిక దళ విమానాలు రాత్రంతా పాకిస్తాన్ సరిహద్దు చుట్టూ చురుగ్గా ఉన్నాయి. నిఘా సమాచారాన్ని సేకరించడానికి పాకిస్తాన్ రెండు యుద్ధ విమానాలను మోహరించింది.

# తెలంగాణ భవన్ జనతా గ్యారేజ్‌లా మారింది.. కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి



ఒక ఉద్యమ సంస్థగా ఏర్పడి.. బోధించు, సమీకరించు, పోరాడు అనే ప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణను సాధించాలనే నినాదంతో పురుడు పోసుకుంటున్న సంస్థ టీఆర్ఎస్ అని తెలిపారు. హిమాలయాల స్థాయికి తెలంగాణను తీసుకొచ్చి పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను అద్భుతంగా నిర్వహిస్తున్న పార్టీ బీఆర్ఎస్ అని తెలిపారు. దేశం మొత్తంలో గుర్తింపు తెచ్చుకున్న పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల గుండె ధైర్యం గులాబీ జెండా అని చెప్పారు. రాష్ట్రంలో ఏ వర్గ ప్రజలకు కష్టమొచ్చినా తెలంగాణ భవన్‌కు వస్తున్నారని అన్నారు. జనతా గ్యారేజీ మాదిరిగా ప్రజల కోసం పనిచేస్తున్న పార్టీ బీఆర్ఎస్ అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలందరూ గులాబీ జెండాకు జై కొడుతున్నారని చెప్పారు. రజతోత్సవ సభకు వరంగల్ వేదిక కావడం గర్వకారణమని కేటీఆర్ అన్నారు. ఎల్కతుర్తి సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వెయ్యి ఎకరాల్లో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశామని చెప్పారు. 30-40 వేల వాహనాలు వచ్చినా ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. 10 లక్షల వాటర్ బాటిల్స్, మజ్జిగ ప్యాకెట్లు, వెయ్యికి పైగా వైద్య బృందాలు, 20 అంబులెన్స్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇంత చక్కటి ఏర్పాట్లు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు మీద నమ్మకం లేదని కేటీఆర్ అన్నారు. అందుకే సభ కోసం 200 జనరేటర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులందరూ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చరిత్రలోనే ఎల్కతుర్తి సభ భారీ బహిరంగ సభగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను చూడాలె%ొ% ఆయన మాట వినాలని ప్రజలు ఉర్రూతలు ఊగుతున్నారని అన్నారు. బండి ఎనక బండి గట్టి పద్ధతిలో పెద్ద ఎత్తున సూర్యాపేట రైతన్నలు వస్తున్నారని తెలిపారు. సభ కోసం 2వేల మంది వాలంటీర్లు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెల 27న 12796 గ్రామ పంచాయతీల్లో గులాబీ జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కదం తొక్కిన ఉత్సాహంతో ఛలో వరంగల్ సభకు చేరుకుందామని అన్నారు. కాంగ్రెస్ అరాచక పాలనను వరంగల్ సభలో ఎండగడుదామని అన్నారు. 11 ఏళ్లుగా బీజేపీ తెలంగాణకు అన్యాయం చేస్తుందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ సందేశాన్ని గులాబీ సైనికులు ప్రతి గ్రామానికి చేర్చాలని సూచించారు.

## బార్డర్‌లో వార్ టెన్షన్! పహెల్గం

# ఎటాక్ తర్వాత పాక్ కుయుక్తులు

మొదటి పేజి తరువాయి



దీంతో భారత్-పాక్ సరిహద్దులో వార్ టెన్షన్ నెలకొన్నది. భారత సరిహద్దుల వెంట పాకిస్తాన్ భారీగా సైన్యాన్ని మోహరిస్తోంది. కరాచీలో ఉన్న యుద్ధ విమానాల్లో కొన్నింటిని లాహెూర్, రావల్పిండికి, మరికొన్నింటిని కశ్మీర్ సరిహద్దుల వైపు తరలిస్తోంది. పాక్ యుద్ధ విమానాల తరలింపు విషయాలను పలువురు నెటిజన్లు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు.

: సీఎంను నరికి బ్యాగులో కుక్కుతాను : సిద్ధ రామయ్యకు బెదిరింపు మెయిల్స్

కేంద్ర కేబినెట్ అత్యవసర సమావేశం!

పాకిస్తాన్ కవ్వింపు చర్యల నేపథ్యంలో భారత త్రివిధ దళాధిపతులు కశ్మీర్‌లోని పలు ప్రాంతాలు, ఎల్‌వోసీ వద్ద భద్రతా దళాలను అప్రమత్తం చేశారు. ఇప్పటికే రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్రివిధ దళాధిపతులతో సమావేశమయ్యారు. మరోవైపు పహెల్గాం ఉగ్రదాడిని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ దాడికి పాల్పడింది పాకిస్తాన్‌కు చెందిన లష్కరే తోక సంస్థ కావడంతో పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రధాని మోదీ ఉన్నతాధికారులతో భేటీ నిర్వహించగా. ఇవాళ సాయంత్రం 6 గంటలకు కేంద్ర కేబినెట్ అత్యవసర సమావేశం కాబోతున్నట్లు సమాచారం. ఈ మేరకు కేబినెట్ మంత్రులు అత్యవసరంగా ఢిల్లీకి చేరుకోవాలని పీఎంవో ఆదేశాలు ఇచ్చింది. పాక్ విషయంలో విదేశాల సహకారం, రక్షణ ఆయుధాల అవసరంపై ఈ భేటీలో కీలకంగా చర్చించనున్నట్లు తెలుస్తోంది. పాకిస్తాన్‌పై ప్రతీకార చర్యల్లో భాగంగా అందరి దృష్టి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌పైనే అందరి చూపు ఉంది.

గుండెలు పగిలేలా ఏడ్చిన నవ వధువు.. యావద్దేశాన్ని కన్నీరు పెట్టిస్తున్న వీడియో

మతం టార్గెట్‌గా దాడి: రాజ్‌నాథ్ సింగ్

పహెల్గాం దాడికి అతి త్వరలోనే ప్రతీకారం తీర్చుకుంటామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇవాళ ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన.. భారత్‌ను ఎవరూ భయపెట్టలేరని, ప్రపంచం ఆశ్చర్యపోయే రీతిలో త్వరలోనే జవాబిస్తామన్నారు. పహెల్గాం దాడి పిరికిపంద చర్య అని, ప్రత్యేకంగా ఒక మతాన్ని లక్ష్యంగా ఈ ఉగ్రదాడి జరిగిందన్నారు. ఉగ్రవాదులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఈ దాడి వెనుక ఎవరు ఉన్న వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కుట్రదారులు ఎక్కడ నక్కినా వెతికి పట్టుకుంటామన్నారు. టెర్రరిజాన్ని తుదముట్టించాలనేది భారత్ విధానమన్నారు.

# అమరావతికి మద్దతివ్వండి

మొదటి పేజి తరువాయి

సందర్భంగా చంద్రబాబును అమిత్ షా ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ అరాచక నిర్ణయాలతో రాజధాని నిర్మాణం ఐదేళ్లు వెనక్కు వెళ్లిందని, ఈ పరిస్థితిని సరిదిద్ది ఏపీ ప్రజలకు ఒక భవ్యమైన రాజధానిని త్వరితగతిన నిర్మించేందుకు కేంద్రం పూర్తి మద్దతునివ్వాలని కోరారు. రాష్ట్రాన్ని గాడినపెట్టేందుకు గత 10 నెలల్లో తమ ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను ఆయన అమిత్ షాకు వివరించారు. కాగా, జగన్ హయాంలో పెద్దఎత్తున జరిగిన మద్యం కుంభకోణం గురించి కూడా చంద్రబాబు ఆయనకు వివరించినట్టు తెలిసింది. దీనితో పోలిస్తే ఢిల్లీ మద్యం కుంభకోణం చాలా చిన్నదని, దాని ద్వారా వచ్చిన అక్రమ ఆదాయాన్ని అనేక రకాలుగా మళ్లించారని ఆయన చెప్పినట్టు సమాచారం.

### కేంద్ర మంత్రులతో భేటీ

జల్ జీవన్ మిషన్ పథకానికి కేంద్ర నిధుల మంజూరుపై కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చంద్రబాబు చర్చించారు. ఈ పథకాన్ని రాష్ట్రంలో విస్తృత స్థాయిలో ఉపయోగించుకోవాలని భావిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చేందుకు ప్రతిపాదించిన పోలవరం- బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సాయం చేయాలని కోరారు. అదేవిధంగా కేంద్ర అటల్ భూజల్ యోజనపైనా కేంద్రమంత్రితో చర్చించారు. భూగర్భ జలాల వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి, ఈ కార్యక్రమానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌తో సీఎం సమావేశమయ్యారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కాగా, ఏపీలోని ఆక్వా రైతులను ఆదుకోవాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్‌కు చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. అమెరికా సుంకాల కారణంగా ఆక్వా రంగంలో నెలకొన్న సమస్యలపై కేంద్ర మంత్రితో చర్చించారు. సీఫుడ్‌పై విధించిన 26శాతం సుంకాలు ఆక్వా రంగానికి తీవ్ర నష్టం చేస్తున్నాయని వివరించారు. అమెరికాతో చర్చించి ఆక్వా రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. చంద్రబాబు వెంట కేంద్ర మంత్రులు కింజారపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు టీడీపీ ఎంపీలు ఉన్నారు.

# రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయం : ఎమ్మెల్సీ కవిత

మొదటి పేజి తరువాయి




బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల గుండె చప్పుడైందని తెలిపారు. ప్రతి ఒక్కరితోనూ బీఆర్ఎస్ పార్టీ పెనవేసుకుందని.. తెలంగాణ ప్రజలతో పార్టీది పేగుబంధమని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు అవహేళన చేసిన వారికి కూడా గులాబీ జెండా రక్షణగా ఉందని అన్నారు. పదేళ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే నంబర్‌వన్‌గా నిలిపామని గుర్తుచేశారు. గులాబీ జెండా 25 ఏండ్ల చరిత్రను యావత్ తెలంగాణ గుర్తుచేసుకుంటుందని కల్వకుంట్ల కవిత అన్నారు. ఏడాది పాటు బీఆర్ఎస్ పార్టీ వేడుకలు చేస్తామని తెలిపారు. ప్రతి ఏటా ప్లీనరీలు జరుపుకుంటున్నా.. ఈ రజతోత్సవ సభ ప్రత్యేకమైందని తెలిపారు. గత 25 ఏళ్లుగా ఉద్యమ, బీఆర్ఎస్ పాలనా కాలాన్ని ప్రజలంతా నెమరేసుకునేలా ఈ సభ ఉండబోతుందని చెప్పారు. ఈ రజతోత్సవ సభకు పెద్దపల్లి జిల్లా నుంచి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అంటే ప్రేమ ఉన్న ప్రతిఒక్కరూ వరంగల్ సభకు రావాలన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా, తెలంగాణ కుంభమేళాగా సభ జరగనుందని చెప్పారు. పెద్దపల్లి కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టి రైతులకు భరోసా లేకుండా చేసిందని మండిపడ్డారు. వ్యవసాయం చేయాలంటే రైతులు భయపడే స్థితికి తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు వడ్లు తడిసి, మామిడికాయలు రాలి రైతులు నష్టపోతుంటే ఈ జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో అకాల వర్షాలకు రైతులు నష్టపోతే క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపరిహారం అందజేశామని గుర్తుచేశారు. మరి కాంగ్రెస్ పార్టీ రైతులను ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. గ్రూప్-1లో అవకతవకలు జరిగాయని.. ఆ పరీక్షను రద్దు చేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. కేసీఆర్ జీవో 55 తెస్తే.. కాంగ్రెస్ జీవో 29 తీసుకొచ్చి యువకుల పొట్టకొడుతున్నారని మండిపడ్డారు. స్థానికత కోసమే తెలంగాణ పోరాటం జరిగితే.. కాంగ్రెస్ మళ్లీ నాన్ లోకల్ తీసుకొస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఇచ్చిన 80 వేల ఉద్యోగాల నోటిఫికేషన్ల నుంచి 50 వేల ఉద్యోగాలిచ్చి తామేదో కొత్తగా చేసినట్లుగా కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్నారని విమర్శించారు. గురుకులాలను నాశనం చేసి విద్యార్థులను పొట్టనపెట్టుకున్నారని మండిపడ్డారు. జిల్లాకో పెట్రోల్ బంక్‌తో వచ్చే లాభమేమీ లేదని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు జై తెలంగాణ అనలేదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఉద్యమ కాలం నుంచి తెలంగాణ వచ్చాక కూడా జై తెలంగాణ అనని ముఖ్యమంత్రి ఉండటం, మంత్రివర్గం ఉండటం మన దురదృష్టమని వ్యాఖ్యానించారు. జై సోనియమ్మ అనుడే తప్ప జై తెలంగాణ వాళ్ల నోటిలోనుంచి రాదని విమర్శించారు. ఆ మాట రానంతసేపు వాళ్లు తెలంగాణ గురించి ఆలోచించరని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో సింగరేణిని ప్రైవేటుపరం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. లాభాల వాటాలో సగం డబ్బులు ఇచ్చి కార్మికులను మోసం చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్, బీజేపీలకు చెరో 8 మంది ఎంపీలు ఉన్నప్పటికీ రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని విమర్శించారు. వాళ్లను చూస్తుంటే ఇంటిపనికైనా, ఒంటిపనికైనా మనోడు ఒక్కడు ఉండాలని అనిపిస్తుందని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటేనని ఆమె వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

# 593 మార్కులతో మెరిసిన బాపట్ల బావ పూరి




ఉమ్మడి గుంటూరు జిల్లా,బ్యూరో చీఫ్ ఉప్పాల మురళి, (శుభోదయం న్యూస్): 593 మార్కుల తో మెరిసిన బాపట్ల భావపురి కాలనీ పేద విద్యార్థి "షేక్ జహూరా"ను అభినందించిన బాపట్ల భావపురి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆవల వెంకటేశ్వర్లు.స్థానిక బాపట్ల పట్టణ భావపురి కాలనీ షేక్ జాఫర్ వలి, షేక్ షమీ ఉన్ దంపతుల కుమార్తె షేక్ జహూరా ఈరోజు



వచ్చిన 10 వ తరగతి పరీక్షా ఫలితాల్లో 600 కు 593 మార్కులు సాధించి ఒక పేద తాపీ వర్కర్ కుటుంబంలో మెరుపు లా మెరిసింది.స్థానిక సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఆమె కు అక్కడి ఉపాధ్యాయులు కృషి తో పాటు స్థానిక భావపురి విద్యాసంస్థల ట్యూషన్ టీచర్ బుజ్జమ్మ విద్యార్థి గా ఈ ఫలితాలు సాధించటంతో పాటు అనేక పోటీ పరీక్షలకు అవసరం అయిన మెటీరియల్స్ తీసి శిక్షణ నిచ్చి బహుమతులు పొందేందుకు కృషి చేసింది.ఫైనల్ పరీక్షలో ఈ మార్కులు సాధించిన జహూరా ను, వారి తండ్రి జాఫర్ వలి ని, ట్యూషన్ టీచర్ బుజ్జమ్మ ను పూల బొకేలతో శాలువా లతో సన్మానించి స్వీట్ లు పంచి అభినందనలు తెలిపిన భావపురి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆవల వెంకటేశ్వర్లు సీనియర్ ఫ్యాకల్టీ శర్మ సార్,మరకతవల్లి మేడం,దేవిక మేడం స్టాఫ్.స్టూడెంట్స్ . తదితరు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వారసత్వ సంపదకు నిలయాలు పుస్తకాలే...




ఉమ్మడి,అనంతపురం జిల్లా బ్యూరో"నరేంద్ర" (శుభోదయం న్యూస్):-పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు స్థానిక ఎ యస్ యన్ యం ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) గ్రంథాలయం విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని 23-04 -2025 న జంతుశాస్త్ర విభాగం లో సభా కార్యక్రమం నిర్వహించబడింది.గ్రంథాలయాధికారి వి వి సిహెచ్ రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డా తిరువీధుల రాజరాజేశ్వరి మాట్లాడుతూ భారతీయ వారసత్వ సంపదకు మూలం మన పూర్వీకులు అందించిన పుస్తకాలేనన్నారు.యావత్ ప్రపంచంలో పుస్తకాలకు ఉన్న ప్రాధాన్యత దేనికీ లేదన్నారు.ప్రపంచ మేధావులను పుస్తకాలే తయారు చేసాయని,ఎంతో మంది పుస్తక ఫ్లినంతోనే గొప్ప వ్యక్తులుగా ఎదిగారని అంతెందుకు భారత స్వాతంత్ర్య సంగ్రామంలో గ్రంథాలయాలు ప్రముఖ పాత్ర వహించాయంటే అందుకు కారణం పుస్తక పఠనమేనన్నారు.కందుకూరి వీరేశలింగం పంతులు చిరిగిన చొక్కా అయినా తొడుక్కో మంచి పుస్తకం కొనుక్కో అన్నారంటే పుస్తక ప్రాధాన్యత ఏ పాటిదో అర్థమౌతుందన్నారు. నేటి యువత ఆ దిశగా పుస్తక పఠనం చేసి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.ఆత్మీయ అతిథిగా విచ్చేసిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ మాట్లాడుతూ పుస్తకాలు మానసిక సామర్థ్యాన్ని పెంచే రసగుళికలన్నారు.ఈ రోజు ప్రపంచంలో ఏదైనా కొత్త ఆవిష్కరణ జరిగిందంటే అది పుస్తకాలు ద్వారా బయట ప్రపంచానికి తెలుస్తుందని,అక్షరబద్ధం చేసిన పుస్తకాలు భావితరాలకు బాసటగా నిలుస్తాయన్నారు.ఈ కార్యక్రమం లో తెలుగు శాఖాధిపతి డా బూసి వెంకటస్వామి ,జంతు శాస్త్ర విభాగాధిపతి డా యం రామకృష్ణ,అధ్యాపకులు బి ఆశాజ్యోతి,బి కె వి రామలక్ష్మి తదితరులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# తలుపుల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విజయకేతనం...



ఉమ్మడి,అనంతపురం జిల్లా బ్యూరో "నరేంద్ర" (శుభోదయం న్యూస్):-తలుపుల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విజయకేతనం పదవ తరగతి పరీక్ష ఫలితాలలో తలుపుల కస్తూరుబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు 37 మంది గాను 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ప్రథమ స్థానం లోమహాలక్ష్మి 516 మార్కులతో ద్వితీయ స్థానంలో %=%. శైలజ 514 మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు స్పెషలాఫీసర్ మోహనమ్మ తెలిపారు.

## ఓడి చెరువులో నిర్వహించిన ఎమ్మెల్యే గ్రీవెన్స్ కార్యక్రమానికి అనూహ్య స్పందన



### అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

శ్రీ సత్యసాయి జిల్లా బ్యూరో వై. పోతులయ్య (శుభోదయం న్యూస్): ప్రజలు ఇచ్చిన అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అధికారులను ఆదేశించారు. ఓడి చెరువు మండల కేంద్రంలోని ఐటిఐ లో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమానికి ఎమ్మెల్యే తో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని అధికార యంత్రాంగానికి సూచించారు. గత గ్రీవెన్స్ లో ప్రజలు ఇచ్చిన అర్జీలకు ఎలాంటి పరిష్కారం చూపారో వాటిని వెల్లడించాలని ఆయా మండలాల వారిగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత అర్జీలకు పరిష్కారం చూపకుండా తిరిగి అదే సమస్యపై అర్జీలు తీసుకోవడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. ఇకపై ప్రతి గ్రీవెన్స్ లో వచ్చే ప్రజా సమస్యల ను వచ్చే గ్రీవెన్స్ నాటికి పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అలా చూపని అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. భూ సమస్యలపై మధ్య మార్గంగా ఇరు వర్గాలను కూర్చోబెట్టుకొని రికార్డు ప్రకారం వాటి పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు. గ్రామంలో ఎక్కడ త్రాగునీటి సమస్య రాకుండా చూడాలని కోరారు. త్రాగునీటి కి ఇబ్బందులు ఉన్న చోట ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటి సరఫరా చేయాలని సూచించారు. గ్రామాల్లో సిసి రోడ్లు , డ్రైనేజీ ,లైట్లు, ఉపాధి హామీ పనులు ఎక్కువగా చూపించాలని సూచించారు. ఇళ్ల స్థలాల సమస్యలపైన, పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లించాలని అధికారులకు సూచించారు. రెవిన్యూ, త్రాగునీరు ,ఇళ్ల స్థలాలు, ఇండ్లు ,పింఛన్లు , ఉపాధి పనులు, పాత పెండింగ్ పనులకు బిల్లులు మంజూరు చేయాలని పలువురు కోరారు. ఓడి చెరువు నుంచి బాబాసపల్లికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉందని వాటిని రోడ్డు విస్తరణ పనులు చేపట్టి న్యాయం చేయాలని ఆ గ్రామస్తులు ఎమ్మెల్యేని కోరారు. మామిళ్ళకుంట్లపల్లి నుంచి ఓడి చెరువుకు గతంలో ఉన్న పూర్వ దారిని వెడల్పు చేసే విధంగా అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. ఓడి మండల కేంద్రంలో పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సిపిఐ,బిజెపి జనసేన నాయకులు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిని కోరారు. పేదలకు నీళ్లు పట్టాలు నూతన ఎన్టీఆర్ గృహాలు నూతన పింఛన్లు రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు కార్యక్రమానికి అమడ గూరు ,ఓడి చెరువు ,నల్లమాడ మండలాల నుంచి వందలాదిమంది ప్రజలు తరలివచ్చారు. భూ సమస్యలు, త్రాగునీటి ఎద్దడి, రోడ్లు, ఉపాధి కల్పించాలని ప్రజల నుంచి సుమారు 238 అర్జీలను ఎమ్మెల్యే ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్డీఓ సువర్ణ స్వీకరించారు . ఈ కార్యక్రమంలో మూడు మండలాల తహసిల్దార్లు ఎంపీడీవోలు ఆర్డబ్ల్యూఎస్ పంచాయతీరాజ్ ,ఆర్ అండ్ బి ,ఇరిగేషన్ , డ్వామా ,డి ఆర్ డి ఏ, అగ్రికల్చర్ ,హార్టికల్చర్ , ఐసిడిఎస్, రెవిన్యూ ,పోలీస్ తదితర శాఖ అధికారులు ,స్థానిక ప్రజాప్రతినిధులు,కూటమి పార్టీల నాయకులు కన్వీనర్లు జయచంద్ర,గోపాల్ రెడ్డి, మైలే శివశంకర్ ,రాష్ట్ర డైరెక్టర్ కాలే నాయక్, మాజీ జెడ్పీటీసీ లు పిట్టా ఓబుల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు సాగునీటి సంఘం అధ్యక్షులు బొడ్డు జయన్న ,తుమ్మల మహబూబ్ బాషా,జాకీర్ ,రామాంజీ ,జనసేన కన్వీనర్లు మేకల ఈశ్వర్ , బీజేపీ వీరాంజి , కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు ,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి వ్యాయామం అవసరం ప్రజల ఆర్యోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న కూటమి ప్రభుత్వం



శ్రీ సత్యసాయి జిల్లా బ్యూరో వై. పోతులయ్య (శుభోదయం న్యూస్): పెనుకొండ పట్టణంలోని జూనియర్ కళాశాల నందు రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ను మంత్రి సవితమ్మ బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేటి సమాజంలో ఈ ఉరుకుల పరుగుల జీవితంలో శరీర ధాడుర్యం లేక అనేక అనారోగ్య సమస్యలకు గురౌ వుతున్నారు.ఆరోగ్యానికి వ్యాయామం అవసరం అని తెలిపారు.కూటమి ప్రభుత్వం ప్రజల ఆర్యోగ్యంకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. త్వరలో మరికొన్ని చోట్ల ఇలాంటి జిమ్ లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.మంచి ఆహ్లాదకరమైన వాతావరణం లో జిమ్ ఏర్పాటు చేస్తుండడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారనీ తెలిపారు.గత ప్రభుత్వం లోని అన్ని స్కాములను ఒక్కొక్కటిగా వెలికి తీస్తామని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నగర పంచాయతీ కమిషనర్ సతీష్ కుమార్, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కేశవయ్య, పట్టణ టిడిపి అధ్యక్షులు శ్రీరాములు, టిడిపి నాయకులు చిన్న వెంకటరాముడు, సర్పంచ్ శ్రీనివాసులు,త్రివేంద్ర నాయుడు, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాసులు అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఉగ్రదాడిని బహుజన చైతన్య వేదిక తీవ్రంగా ఖండిస్తోంది

### బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ



శ్రీ సత్యసాయి జిల్లా బ్యూరో వై.పోతలయ్య (శుభోదయం న్యూస్): జమ్మూ కాశ్మీర్ పహల్గాం లో పర్యాటకులపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపి అనేకమంది అమాయక ప్రజల ను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపిన ఉగ్రవాదుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ తెలిపారు. మంగళవారం జమ్మూ కాశ్మీర్లో జరిగిన ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తూ మృతి చెందిన వారికి బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తూ పెనుగొండ పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్లో నిరసన ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ మాట్లాడుతూ భారత సమైక్యత సార్వభౌమత్వాన్ని, ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు ఉగ్రవాదులు పర్యాటకులైనటువంటి అమాయక ప్రజలను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపడం హేయమైన చర్యని ఈ సంఘటన ప్రతిభారతీయుడు తీవ్రంగా ఖండించాలని తెలిపారు. ఇలాంటి ఉగ్రదాడులతో భారతదేశ సమైక్యతను, సార్వభౌమత్వాన్ని దెబ్బతీయలేదని తెలిపారు. ఇలాంటి దాడులపట్ల భారత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇంతటి దుచ్చెర్రెలకు పాల్పడిన ఉగ్రవాదులపై భారత ప్రభుత్వం వెంటనేచర్యలు తీసుకొని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠినశిక్షలు అమలు చేయాలని భారతదేశ ప్రధానమంత్రిని, కేంద్ర హోం శాఖను కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ మహమ్మద్ తయుబ్ మాట్లాడుతూ ఉగ్రవాదుల జమ్మూ కాశ్మీర్లో పర్యాటకులైన అమాయక ప్రజల ప్రాణాలను తీయడం హేయమైన, అమానవీయ చర్య అనే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు గట్టి నిగాను ఏర్పాటు చేయాలని, ఇంతటి దుశ్చర్యకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని తెలిపారు. ఉగ్రవాదులు చర్యలతో భారత దేశ ప్రజల సమైక్యతను దెబ్బతీయలేరని తెలిపారు. ఉగ్రవాదులు భారతదేశ లౌకికత్వాన్ని దెబ్బతీయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సద్దాం, బహుజన చైతన్య వేదిక సభ్యులు, రవికుమార్, కొల్లప్ప, ఆంద్రూస్, రామాంజనేయులు, ముస్లిం మైనార్టీ నాయకులు, సామాజిక, సాహితీవేత్త కోగిర జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన... మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): శీలంవారిపల్లి గ్రామానికి చెందిన కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ ప్లస్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇరగని చలపతి రావు మనవరాలు కావ్య , కళ్యాణ్ ల వివాహం బుధవారం నిజామాబాద్ లో జరిగింది. ఈ వివాహ వేడుకలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే



కదిరి బాబురావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహేందర్ రెడ్డి,కదిరి ప్రకాశ్ రావు,కదిరి పార్థసారథి,కదిరి బాల కృష్ణా,కదిరి కృష్ణ, సర్పంచ్ షేక్ బుజ్జి, ఉప సర్పంచ్ టి బాబురావు, మాజీ ఎంపిటిసి మునగల నారాయణ రెడ్డి, ఇరగని నేమాజి,తదితరులు పాల్గొన్నారు.

# పామూరు శ్రీ చైతన్య విద్యార్థుల విజయభేరి



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): స్థానిక పామూరు పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ నందు విడుదలైన %బూాజ% ఫలితాలలో 593 /600 మార్కులతో పోకా. షణ్ముఖ దీప లోకనాథం మండలం ఫస్ట్ సాధించింది. ద్వితీయ తృతీయ స్థానాలలో యాదాల.



చార్వి(588) , సయ్యద్. షాస్మిన్ ( 587) తదుపరి అత్యున్నత మార్కులు సాధించినమా విద్యార్థులు 580 పైగా 9 మంది500 పైగా 33 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. నూరు శాతం ఉత్తిర్నత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ జిలాని భాష తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, అనిల్, కోర్డినేటర్స్ వీరా, శ్రీను, డీన్ కిషోర్, 10 ఇంచార్జ్ గుత్తి. మహిత్, శ్రీనివాసులు, సుకుమార్ ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# శృంగారానికి అడ్డు వస్తున్నాడని కొడుకును కడతేర్చిన పిన్ని.





ములుగు జిల్లా, నారాయణమూర్తి ( శుభోదయం న్యూస్) : ములుగు జిల్లాలో జరిగిన దుర్ఘటన ప్రజల గుండెలకు గాయాన్ని మిగిల్చింది ఒక కపట దారి నటన చాతుర్యముతో! చేయుత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సాయి ప్రకాష్ (29)ను అతి కిరాతకముగా సంపించిన సొంత చిన్నమ్మ చిడం నిర్మల (40). ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు ) మండలంలో చేయుత స్వచ్ఛంద సంస్థ నడుపుతూ ప్రజలకు సేవ చేస్తూ గ్రామాల వారీగా ఏమీ ఆశించకుండా సేవలందించిన చిడెం సాయి ప్రకాష్ హఠాత్తుగా మరణించాడు అనే వార్త వినగానే పల్లెల్లో ఉన్న ప్రజానీకం కంటతడి పెట్టుకుంటూ బాధపడ్డారు. ఆరోగ్యం బాగా లేకుండా అనుమకొండ కు వెళ్లిన గ్రామ ప్రజలను తన కారులో ఉచితంగా వెంకటాపురం తీసుకొచ్చి వారికి ఆకలి దప్పికలు ఏమన్నా ఆయనే చూసుకునేవాడు, ఆరుగుంటపల్లి మురుమూరు ఆయన మరణ వార్త విని కన్నీరు పెట్టుకున్నారు. వెంకటాపురం మండలంలో అన్నదమ్ముల మధ్య భూతగాధ రావటంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు అందడంతో చిడెం నిర్మల మరికొందరు పోలీస్ ఠానాకు వెళ్లారు అదే ఠానాలో పోలీస్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న భాష బోయిన శ్రీనివాస్ (40) నిర్మల తో పరిచయం అవటంతో వాళ్ళిద్దరి మధ్య అక్రమ సంబంధం ఏర్పడినది. బహిరంగంగానే ఇంటికి వచ్చి లైంగిక వాంచ తీర్చుకునేవాడు ఈ సమస్య ఇంటి పరువుకు సంబంధించి నది అవటం వలన కుటుంబ సభ్యులు శ్రీనివాస్ పై కేసు పెట్టడంతో సస్పెండ్ చేశారు. నిర్మల శ్రీనివాసులు సాయి ప్రకాష్ పై కక్ష పెంచుకొని ఉద్దేశపూర్వకంగానే చంపాలని నిర్ణయించుకున్నారు. సాయి ప్రకాష్ పై రెక్కీ నిర్వహించి పథకం వేసుకొని సుపారీ గ్యాంగును ఏర్పాటు చేసుకున్నారు ఈనెల 15వ తారీఖున నిర్మల కుటుంబ సభ్యులను ప్రైవేటు దవాఖానకు సాయి ప్రకాష్ తన కారులో హనుమకొండకు తీసుకెళ్లాడు, నిర్మల కానిస్టేబుల్ కు ఫోన్ చేసి సాయి ప్రకాష్ గురించి వివరాలు చెప్పినది. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం సుపారి మాట్లాడుకున్న గ్యాంగ్ ను అప్రమత్తం చేసుకుని సాయి ప్రకాష్ దవాఖా నుండి తిరిగి వెళుతున్న తరుణంలో శ్రీనివాస్ కానిస్టేబుల్ సుపారీ గ్యాంగ్ కలిసి సాయి ప్రకాష్ ను కిడ్నాప్ చేసి కాళ్లు చేతులు కట్టి నోరు కూడా కట్టేసి తీసుకెళ్లి సున్ని వడి పెట్టి మెడకు బిగించి గీరి చంపి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కమిషనరేట్ పరిధిలో జిల్లేడు గడ్డ గ్రామ శివారు వ్యవసాయ బావిలో పడేసి వెళ్లిపోయారు. ఈనెల 18వ తారీకున సాయి ప్రకాష్ కుటుంబ సభ్యులు హనుమకొండ పోలీసు స్టేషన్ లో మిస్సింగ్ కేసు పెట్టారు. పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టి బృందాలుగా విడిపోయి గాలింపు చర్యలు చేపట్టారు. సాయి ప్రకాష్ కుటుంబ సభ్యులు నిర్మ లపై కానిస్టేబుల్ శ్రీనివాస్ పై అనుమానం ఉందని, వాళ్ళిద్దరి మధ్య అక్రమ సంబంధం ఉండటం గురించి చెప్పటంతో కానిస్టేబుల్ శ్రీనివాసును పిలిపించి విచారణ జరిపారు మేమే హత్య చేశామని, సాయి ప్రకాష్ పై ఎప్పటినుండో మాకు కక్ష ఉన్నదని వివరించారు. పోలీసులు అరెస్టు చేసిన వారు 1. భాష బోయిన శ్రీనివాస్ ములుగు జిల్లా వెంకటాపూర్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్,2. జిబిలి సాయి గుంటూరు జిల్లా ఆంధ్ర ప్రదేశ్,3. ఆలోత్ అరుణ్ కుమార్ (పండు ) హనుమకొండ, 4. రాజు హనుమకొండ,5. సభావాత్ అఖిల్ నాయక్ హనుమకొండ,6. చిడెం నిర్మల నూగూరు వెంకటాపురం ములుగు జిల్లా వారుగా పోలీసులు గుర్తించారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ కనపరిచిన హనుమకొండ ఏసీబీ రవీందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ సతీష్ మరియు పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందనలు తెలిపారు. ఈ ప్రెస్ మీట్ లో ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, ఏ ఎస్ పి మదన్ బట్ పాల్గొన్నారు.

# జమ్మూ కాశ్మీర్ ఉగ్రదాడి చాలా బాధాకరం - బీజేపీ నాయకులు బీరుగొండ.



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):జమ్మూ కశ్మీర్‌లో జరిగిన భారీ ఉగ్రదాడి.. యావత్ దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సౌదీ అరేబియా పర్యటనలో ఉండగా.. అదే సమయంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్‌లో పర్యటిస్తున్నారు. ఇలాంటి సమయంలో ఉగ్రవాదులు జమ్మూ కశ్మీర్‌లో బరితెగించి.. ఏకంగా పర్యటకులను లక్ష్యంగా చేసుకుని దాడి చేయడం సంచలనంగా మారింది. జమ్ము కాశ్మీర్ పహాల్గంలో జరిగిన ఉగ్రదాడి బాధాకరం కాల్పుల్లో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మరణించిన వారి ఆత్మలకు శాంతిని చేకూరాలని ప్రార్థిద్దాం అని బీర్కూర్ బిజెపి నాయకుడు బీరుగొండ ఒక ప్రకటనద్వారా తెలిపారు

# బీర్కూర్ లో నిఘా లోపం



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో నిఘాలోపం సీసీ కెమెరాలు ఉన్న అవి పని చెయ్యని పరిస్థితి బీర్కూరు పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంది. బీర్కూర్ పట్టణ కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి మేకల రాజు అనే వ్యక్తి తన టెంట్ హౌస్ ముందు పార్కింగ్ చేసి ఉంచిన కారు ను మరియు మున్నూరుకాపు సంఘం ముందు ఉన్న తన ఆటో అద్దాలను పూర్తిగా ధ్వంసం చేశారు. తన స్వయంశక్తి తో పైకి ఎదుగుదలను చూడలేక నా వాహనాలను ధ్వంసం చేసినట్టు వాపోయారు టెంట్ హౌస్ ముందు ఉన్న సీసీ కెమరా కేబుల్ వైర్ ను కట్ చేసి మరీ అద్దాలు ధ్వంసం చేశారని తెలిపారు అద్దాలు ధ్వంసం చేయడమే కాకుండా వాహనాలు పనికి రాకుండా ఇంజన్ లను కూడా ధ్వంసం చేసినట్టు మేకల రాజు తెలిపారు. ఇదిలా ఉండగా బీర్కూర్ కుర్లా గ్రామానికి మధ్య వారధి గా నిర్మించిన వంతెన కారణంగా అటు మహారాష్ట్ర, కర్ణాటక నుండి అనేక రాకపోకలు పెరిగినాయి దీంతో బీర్కూర్ లో రాత్రి కూడా వాహనాల రాకపోకలు నడుస్తున్నాయి. కావున అంతరాష్ట్ర దొంగలు వచ్చే ఛాన్స్ ఎక్కువ గా ఉన్నందున బీర్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి సీసీ కెమరాలను బాగుచేసి నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల బండ్లు దొంగతం కూడా జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి గత కొన్ని నెలల క్రితం కూడా ఇలానే గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి పలు కార్ల అద్దాలు ధ్వంసం చేసిన ఘటనలు ఉన్నాయి. ఇకైన పోలీస్ అధికారులు స్పందించి వెంటనే సీసీ కెమెరాలు బాగుచేయవలసిందిగా బీర్కూర్ పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## : 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు : వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ శ్రీనివాసులు



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): మీరు మీ భవిష్యత్తు లక్ష్యాలకు ఇప్పటి నుండే పునాది నిర్మించుకోండి.ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన ఈ ఫలితాలు ఎంతో ఆనందం కలిగించాయి. ఉత్తీర్ణత సాధించలేని వారు దిగులు చందవద్దు.. తదుపరి ప్రయత్నంలో మీరే విజేతలు కావచ్చు. ఓటమి శాశ్వతం కాదు.., గెలుపే శాశ్వతం అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## అయ్యనకోట సంస్థాగత ఎన్నికల కార్యక్రమంలో పాల్గొన్న పువ్వాడి



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహరెడ్డి గారి అదేశాలమేరకు!టిడిపి సంస్థాగత ఎన్నికల కార్యక్రమంలో పాల్గొన్న! పామూరు మండల టిడిపి అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, టిడిపి రాష్ట్ర జిల్లా నాయకులు అడుసుమల్లి ప్రభాకర్ రావు,యస్.డి అమీర్ బాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు తుమ్మ ఆంజనేయ రెడ్డి, మరియు స్థానిక టిడిపి శ్రేణులు హాజరయ్యారు.

## : పర్యాటకులపై ఉగ్ర దాడి విచారకరం : కలవగుంట భరత్ రెడ్డి

శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) : జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి మారణకాండ సృష్టించడం విచారకరమని ప్రముఖ సంఘ సేవకులు కలవగుంట భరత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది గుండెను మెలిపెట్టి తిప్పే విషాదం అని అన్నారు.పర్యాటకులపై జరిగిన ఈ కిరాతక దాడి ముష్కర మూకల పిరికిపంద చర్యని భరత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ సమైక్యతను దెబ్బతీసే ఉగ్రవాద చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించరాదన్నారు. పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు చేసిన ఈ దాడి దేశ శాంతి భద్రతలను భంగ పరిచే చర్యగా అభివర్ణించారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ఉగ్రదాడిని ఖండించాలన్నారు. ఉగ్ర వాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలన్నారు. దాడికి పాల్పడిన తీవ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనలో మరణించిన బాధిత కుటుంబాలకు కలవగుంట భరత్ రెడ్డి తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. అలాగే గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మల దగ్ధం



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడి,అమాయక ప్రజల మరణానికి కారకులైన ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఏలే చంద్రశేఖర్,జిల్లా నాయకులు బంధారపు లింగస్వామి,దంతూరి సత్తయ్య,కొప్పులయాదిరెడ్డి,రాచకొండ కృష్ణ మరియు జిల్లా సీనియర్ నాయకులు, మండల సీనియర్ నాయకులు,మండల పదాధికారులు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైల్వే గేట్ తో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పట్ల ఎంపీ గడ్డం వంశీకృష్ణ కు వినతి పత్రం అందించిన దబ్బెట భానుచందర్



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్) గౌతమి నగర్ ఆర్ఎస్ఎల్ మధ్యలో ఉన్న రైల్వే ట్రాక్ గేటు అటు వైపుగా వెళుతున్న వాహనదారులకు ఆటంకంగా మారింది ఈ రైల్వే ట్రాక్ పై ఆర్ఎఫ్సిఎల్ యూరియా రవాణా చేసే రైళ్లు, సింగరేణి బొగ్గును ఎన్టిపిసితో పాటు వివిధ ప్రాంతాలకు తరలించే రైళ్లు వెళ్లడం వల్ల ఇక్కడి రైల్వే గేటు ఇబ్బందులకు గురిచేస్తుంది చైతన్యపురి కాలనీ, ఎల్కలపల్లిగేటు, లక్ష్మీపురం, 8ఇంక్లైన్ కాలనీ, సెంటినరికాలనీ, కమాన్పూర్ తో పాటు ఎల్కలపల్లి, గుంటూరుపల్లి, రొంపి కుంట, సబ్బితం వరకు ఉన్న గ్రామాల ప్రజల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే ఈ దారిలో ఆసుపత్రికి వెళ్దాం అన్నా నిత్యం గేటు పడడం వల్ల అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితిని ప్రజలు ఎదుర్కొంటున్నారు ఈ సమస్యపై ఆర్ఎఫ్ సిఎల్, ఎన్టిపిసి, సింగరేణి మరియు దక్షిణ మధ్య రైల్వే అధికారులతో మాట్లాడి ఇక్కడ ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని అప్పటివరకు ఈ రైల్వే లైన్లో ఇప్పటికే ఉన్నటువంటి వర్షం నీరు వెళ్లేందుకు నిర్మించిన డ్రైనేజ్ బ్రిడ్జిలలో ఒక దానిని అండర్ గ్రౌండ్ దారికి ఉపయోగించేలా చేసి ఈ దారిలో ప్రయాణిస్తున్న దాదాపు 20 గ్రామాల ప్రజలతో పాటు సింగరేణి, ఆర్ఎఫ్ సిఎల్, ఎన్టిపిసి కార్మికులు నిత్యం ఎదుర్కొంటున్న ఈ రైల్వే గేట్ ప్రధాన సమస్యకు పరిష్కార మార్గం చూపించాలని దబ్బెట భానుచందర్ వినతి పత్రంలో కోరడం జరిగింది ఇందుకు ఎంపీ వంశీకృష్ణ సానుకూలంగా స్పందించడం జరిగింది.

# తెలంగాణ పౌల్ట్రీ రైతు సోదరులకు ప్రభుత్వం తీపి కబురు

తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదెల రామారావు (శుభోదయం న్యూస్): కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్నటువంటి అంగన్వాడి టెండర్ రద్దుచేసి ,చిన్న ,సన్నకారు, రైతులకు అనుకూలంగా టెండర్ నిర్వహిస్తామని, హామీ ఇచ్చినటువంటి మన ప్రియతమ ముఖ్యమంత్రి ,రైతుబిడ్డ సీఎం రేవంత్ రెడ్డి ,రైతు పక్షపాతి, అయినటువంటి సీఎం రేవంత్ రెడ్డి, చిత్రపటానికి తెలంగాణ పౌల్ట్రీ రైతులు ,తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ మరియు నెక్ ఆధ్వర్యంలో పాలాభిషేకం కార్యక్రమం,24-4-2025 ,రోజు నా ఉదయం 10 గంటలకు, నెక్ ఆఫీస్( బషీర్బాగ్, హైదరాబాద్లో నిర్వహించడం జరుగుతుంది. కాబట్టి ఇట్టి కార్యక్రమానికి తెలంగాణ నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో పౌల్ట్రీ రైతులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మనవి.

# సేవా రత్న అవార్డు గ్రహీత శారద అరిగింటి ను... సన్మానించిన హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ చైర్మన్ కొంపల్లి సత్యనారాయణ గుప్తా.





తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, ( శుభోదయం న్యూస్), ఏప్రిల్ 23: సేవా రత్న అవార్డు అందుకున్న శారదా అరగంటి ను, హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ చైర్మన్ కొంపల్లి సత్యనారాయణ గుప్తా సన్మానించారు. అలాగేఇలాంటి అవార్డులు మరెన్నో పొందాలని ఆయన ఆకాంక్షించారు. సేవా రత్న అవార్డు గ్రహీత తెలంగాణ శ్రామిక మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు అరిగింటి శారద మాట్లాడుతూ, హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ చైర్మన్ కొంపల్లి సత్యనారాయణ గుప్తా చేతుల మీదుగా అవార్డు అందుకోవడం,అభినందించడం సంతోషంగా ఉందని తెలిపారు. అలాగే గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడినప్పుడు కార్మికులకు విశేష సేవలు అందించినందుకు అప్పటి ప్రభుత్వం నన్ను గుర్తించి " శ్రమ శక్తి అవార్డు " కూడా ఇవ్వడం జరిగిందని అన్నారు. అదేవిధంగా కరోనా సమయంలో అనేకమందికి సరుకులు, ఆహారం, హాస్పిటల్ కు రోగులను తీసుకెళ్లి చికిత్స చేయించడం వారిని ఆర్థికంగా ఆదుకోవడం జరిగింది. గాంధీ హాస్పిటల్ లో సంబంధిత అధికారులతో మాట్లాడి రోగులకు ట్రీట్మెంట్ ఇప్పించడం జరిగింది. అందుకుగాను నా సేవలను గుర్తించి హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ సంస్థ నాకు ఈ యొక్క సేవ రత్న అవార్డు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ శ్రామిక మహిళ గ్రేటర్ మహిళా నాయకురాలు దొమ్మాటి నాగమణి,శివకుమార్ లు పాల్గొని,నిత్యం ప్రజలకు సేవ చేసే శారదక్కకు మరెన్నో ఉన్నతమైన అవార్డులు రావాలని కోరుకున్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ అసమర్ధతను రైతు వ్యతిరేక విధానాలతో ప్రభుత్వం పాలన

## బిజెపి నల్లగొండ పార్లమెంట్ కేంద్ర సంక్షేమ పథకాల పర్యవేక్షణ అధ్యక్షులు వంగవీటి శ్రీనివాసరావు



అనంతగిరి 23 ఏప్రిల్ శుభోదయం న్యూస్: రాష్ట్ర ప్రభుత్వ అసమర్ధతను రైతు వ్యతిరేక విధానాలతో ప్రభుత్వం పాలన చేస్తుందనీ బిజెపి నల్లగొండ పార్లమెంట్ కేంద్ర సంక్షేమ పథకాల పర్యవేక్షణ అధ్యక్షులు వంగవీటి శ్రీనివాసరావు అన్నారు అనంతగిరి మండల పరిధిలోని గొండ్రియాల గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ. మండల వ్యాప్తంగా బీజేపీ బృందం వాయిల సింగవరం, త్రిపురవరం, కొత్త గోల్ తండా , అమీనాబాద్, గొండ్రియాల ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించటం జరిగిందన్నారు ప్రధానంగా రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రబీ వరి దాన్యం అమ్మకానికి తీసుకురాకపోవటానికి అనేక కారణాలు ఉన్నాయని తెలిపారు కొనుగోలు కేంద్రాలలో సరైన సౌకర్యాలు లేకపోవడం మరియు తేమ విషయంలో తాలు ఉన్నదని తురుపాల్ బోయాలని అనేక సాకులతో రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఇదే ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో అదే మిల్లర్లు దిగుమతి చేసుకొని వెంటనే డబ్బులు చెల్లిస్తున్నారని తెలియజేశారు. వివిధ సమస్యలతో ఇబ్బందిపడి దాన్నే కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మితే నగదు చెల్లింపు విషయం కానీ బిల్లింగ్ విషయంలో అనేక



ఇబ్బందులకు గురవుతున్నారు దీనిని దృష్టిలో పెట్టుకొని రైతు బయట మార్కెట్ కన్నా ఐకెపి సెంటర్లలో అమ్మితే అదనంగా 500 రూపాయలు సన్న రకాలకు బోనస్ ఇస్తామని చెప్పిన అమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం చెప్పేది ఒకటి చేసేది ఒకటి జరిగేది మరొకటని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మీద నమ్మకం పోయిందనీ రైతులకు రాష్ట్రవ్యాప్తంగా 48 లక్షల హెక్టార్లలో కోటీ 10 లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం పండినదని వ్యవసాయ శాఖ వారు చెబుతున్నారనీ ప్రభుత్వము అందులో రైతు అవసరాలకు పోను 70 లక్షల మెట్రిక్ టన్ను ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని బహిరంగంగా ప్రభుత్వం ప్రకటిస్తుందనీ 18 ఏప్రిల్ వరకు రాష్ట్రంలో ఉన్న ఎనిమిది వేల రెండు వందల ఐకెపి సెంటర్ల ద్వారా కొనుగోలు చేసినది 8 లక్షల 71 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారనీ వారం రోజుల్లో ఐకెపి సెంటర్లకు ఒక్క గింజ ధాన్యం కూడా రాదు అంటే ఈ రబీ సీజన్ మొత్తంలో ప్రభుత్వం చెప్పిన 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలులో 10 లక్షల వ్యక్తికి టన్నులు కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి అంటే రైతు పండిన పంటను తక్కువ ధర కైనా బహిరంగంగా ప్రైవేటు వ్యక్తులకు అమ్ముటకు సుముఖంగా ఉన్నారు కానీ ప్రభుత్వము సన్నరకాలకు 500 రూపాయలు ఎంఎస్ పి ధరల మీద బోనస్సు ఇస్తానన్న ఒక ఎకరానికి 15 వేల రూపాయలు అదనంగా ఇస్తా అన్నా ఐకెపి సెంటర్ల ద్వారా ధాన్యం రైతులు అమ్మటానికి సుముకంగా లేదంటే ఆ యొక్క ఐకెపి సెంటర్లలో ఏ విధమైన విధానం ఉన్నదో ఏ విధమైన ఇబ్బంది ఉన్నదా అందుకొరకే తక్కువ ధరకే నా బహిరంగంగా మార్కెట్లో రైతులు అమ్ముతున్నారంటే ఇది ప్రభుత్వ లోపమా రైతుల లోపమా కావున భవిష్యత్తులో కూడా ఈ విధానం మీద ఆలోచన చేసి ఈ రోజున రాష్ట్రవ్యాప్తంగా గత సంవత్సరంన్నర నుండి అకాల వర్షాలు కురిసి చేతి వచ్చిన పంట నష్టపోయినారని రాష్ట్ర ప్రభుత్వము గతంలో రాష్ట్రాన్ని పాలించిన పార్టీ కూడా ఈ విధంగానే రైతు విషయాలలో వారికి వారి పంటకు బీమా సౌకర్యంలో మొండివైఖరి అవలంబించడం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయకపోవటం వలన ఈ రోజున రాష్ట్రంలో అనేక రకాలుగా రైతు పంట నష్టపోవడం జరుగుతుంది ఏడాదిన్నర నుంచి పాలిస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వము రైతులకు జరిగిన పంట నష్టపరిహారాన్ని సరి అయిన విధంగా ఇవ్వలేకపోయింది గత సంవత్సరం ఆగస్టు సెప్టెంబర్ లో వచ్చిన తుఫాను ద్వారా ములుగు ఖమ్మం నల్లగొండ ఉమ్మడి జిల్లాలలో జరిగిన పంట నష్టానికి ఎ న్డీ ఆర్ ఫ్ నిధుల నుండి 231 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వానికి మంజూరు చేయడం జరిగినదనీ 2024 -25 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తు నిధులు అన్ని రాష్ట్రాలకు కలిపి 18 వేల 670 కోట్ల రూపాయలు డిపాజిట్ చేయడం జరిగిందన్నారు అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ డీ ఆర్ ఎఫ్ నిధుల ద్వారా ఈరోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో 412 కోట్ల రూపాయలు జమ చేయడం జరిగినదనీ కేంద్ర ప్రభుత్వం రైతు ప్రభుత్వానికి మరియు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము అమలు చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎడ్లపల్లి వెంకట నరసయ్య, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు మునగాల శ్రీనివాసరావు బీజేపీ మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు యడ్లపల్లి రామారావు ఎస్.కె యాకూబ్ శీలం సైదులు శివరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ రోడ్డును కాజేసిన భూ బకాసురుడు దండ సాంబయ్య







(శుభోదయం న్యూస్) :స్టేట్ బ్యూరో కె రామారావుగ్రామం గుంటూరు పెల్లి మండలం సంగం జిల్లా వరంగల్ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ రోడ్డును కాజేసిన భూ బకాసురుడు దండ సాంబయ్య %ూ%% శేషగిరిరావు సర్వే నెంబర్ 192 ప్రభుత్వ భూమిని రోడ్డు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాన్ని కాజేసి దర్జాగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రబుద్ధుడు వివరాల్లోకి వెళితే సర్వే నెంబర్ 192 రోడ్డు శంభుని పేట్ నుండి నెక్కొండ వెళ్లే ప్రధాన రహదారిలో %=చీదీ% రోడ్డు మార్జిన్ భూమిని ఆక్రమించుకొని రోడ్డు ఇరువైపులా ఉన్న పట్టా భూమి ఉన్న వాళ్ళని వారి సొంత భూముల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటూ ఎవరు ఎదురు మాట్లాడిన వారిని చంపుతానని భయభ్రాంతులకు గురి చేస్తూ ఒకపక్క హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన వాటిని పట్టించుకోకుండా సంబంధిత అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చుకుంటూ అధికారులను తప్పు దోవ పట్టిస్తున్నాడు ఇప్పటికైనా అధికారులు ఈ యొక్క భూ బకాసురల నుండి భూ బాధితులకు న్యాయం చేయగలరని బాధితులు అధికారులను వేడుకుంటున్నారు

# హైదరాబాద్ ఇందిరా భవన్లో రాష్ట్ర సమావేశంలో పాల్గొన్న వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు ( శుభోదయం న్యూస్)టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, విష్ణు నాథ్, సీడబ్ల్యూసి సభ్యులు వంశీ చంద్ రెడ్డి మరియు ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.సమావేశం ప్రారంభమైన అనంతరం జమ్మూ కాశ్మీర్ ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ దేవుని వేడుకుంటూ మృతి పట్ల సంతాపంగా 2 నిమిషాలు మౌనం పాటించారు.

# దక్షిణ మధ్య రైల్వే జీఎంను కలిసిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు ( శుభోదయం న్యూస్)కాజీపేట రైల్వే సమస్యలపై సుదీర్ఘంగా జీఎంతో చర్చించిన వరంగల్ ఎంపీకాజీపేట ప్రాముఖ్యతను ఎట్టి పరిస్థితిలో తగ్గించకూడదుకాజీపేట బస్టాండ్ విషయంలో త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలిఅమృత్ భారత్ పథకం కింద వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్లో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి.కాజీపేట క్రూ లింకుల తరలింపు విషయంలో వివరణ కోరిన ఎంపీకాజీపేట రైల్వే యూనియన్ తో సమావేశంమై వారి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేసిన ఎంపీవరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అభ్యర్థనల పట్ల సానుకూలంగా స్పందించిన రైల్వే జీఎంమరో మూడు రోజుల్లో కాజీపేట రైల్వే యూనియన్ తో జిఎం సమావేశందక్షిణ మధ్య రైల్వే జనరల్ మెనేజర్ అరుణ్ కుమార్ జైన్ తో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సమావేశం అయ్యారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్ లో ఉన్న రైల్వే సమస్యలను పూర్తి చేయాలని బుధవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో జీఎంకు వినతి పత్రం అందజేశారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ లో కీలకమైన కాజీపేట జంక్షన్ ప్రాముఖ్యతను ఎట్టి పరిస్థితుల్లో తగ్గకుండా చూడాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య రైల్వే జీఎంను కోరారు ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తో పాటు ఎంపీలు రఘురాం రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# జమ్మూ కాశ్మీర్లో హిందువులపై దాడికి నిరసనగా రాస్తారోకో మరియు దిష్టిబొమ్మ దగ్ధం.



ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్) ఏప్రిల్-23నిన్న జమ్మూకాశ్మీర్ ఆనంతనాగ్ జిల్లాలో.కేవలం హిందువులే లక్ష్యంగా హిందువులపై జరిగిన ఉగ్రదాడులకు నిరసనగా.బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పెద్దపల్లి అసెంబ్లీ ఇంచార్జ్. దుగ్యాల ప్రదీప్ కుమార్. సూచనల మేరకు పెద్దపల్లి పట్టణ.మరియు రూరల్ మండల శాఖల ఆధ్వర్యంలోపెద్దపల్లి కమాన్ చౌరస్తాలో రాస్తా రొఖో నిర్వహించి. ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దగ్ధం చెయ్యడం జరిగింది.ఈ కార్యక్రమంలో పెంజర్ల రాకేష్,వేల్పుల రమేష్,తంగేడ రాజేశ్వర్ రావు. శిలారపు పర్వతాలు. పొల్సాని సంపత్ రావు. మేకల శ్రీనివాస్. వొల్లే తిరుపతి .కావేటి రాజగోపాల్. ఈర్ల శంకర్. రాజన్న పటేల్. ఎర్రోళ్ల శ్రీకాంత్ .ఉప్పు కిరణ్. గుడ్ల సతీష్, పడాల శ్రీధర్. పూదరి హరీష్, పూరేళ్ల రాజేశం. చొప్పరి కృష్ణ, మధుకర్. కుక్క అంజి. శివ సాయి. బద్రి దేవేందర్ పటేల్. చెలుకల లింగయ్య. మేకల రాజు. జె.సంపత్ కుమార్. తదితరులు పాల్గొన్నారు.



## ఫెడ్ చీఫ్‌ను తొలగించే ఉద్దేశం లేదు




వాషింగ్టన్ : అమెరికా ఫెడరల్ చీఫ్ జెరోమ్ పావెల్‌ను తొలగించడం లేదని అధ్యక్షులు ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ ప్రతీకార సుంకాలతో ద్రవ్యోల్బణం పెరగనుందని ఇటీవల జెరోమ్ పావెల్ ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్‌పై ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఆయనను పదవి నుండి తొలగిస్తారంటూ ప్రపంచమార్కెట్లలో ఆందోళనను రేకెత్తించాయి. ఈ అంశంపై మంగళవారం ట్రంప్ స్పందించారు. జెరోమ్‌ను తొలగించే ఉద్దేశ్యం తనకు లేదని అన్నారు. వడ్డీరేట్లను తగ్గించడంపై పావెల్ మెరుగ్గా స్పందించాల్సివుందని తాను కోరుకుంటున్నానని అన్నారు. వడ్డీ రేట్లను తగ్గించడానికి ఇది సరైన సమయమని అన్నారు. చైనాపై విధించిన ప్రతీకార సుంకాలపై ట్రంప్ వెనక్కి తగ్గినట్లు కనిపిస్తోంది. "145 శాతం సుంకాలు చాలా అధిక స్థాయి అని, ఇది గణనీయంగా తగ్గుతుంది" అని ట్రంప్ మంగళవారం అంగీకరించారు. చైనా నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలు గణనీయంగా తగ్గుతాయని, కానీ సున్నా మాత్రం కావని అన్నారు. చైనా తమతో ఏదైనా ఒప్పందాన్ని కుదుర్చుకోవాల్సిందేనని అన్నారు.

## కేరళ సిఎం పినరయి విజయన్ విచారం



జమ్మూ కాశ్మీర్ : జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో ఎంతోమంది అమాయకులు ప్రాణాలను కోల్పోయారు. దీనిపై కేరళ సిఎం పినరయి విజయన్ విచారాన్ని వ్యక్తం చేశారు. అక్కడ ఎర్నాంకులమ్‌కు చెందిన వ్యక్తి కూడా మరణించారు. జమ్మూ కాశ్మీర్‌కు వెళ్లిన కేరళ హైకోర్టు న్యాయవాదులు, ఎమ్మెల్యేలు తృటిలో తప్పించుకున్నారు. ఈ మేరకు కేరళ ముఖ్యమంత్రి కార్యాలయం ఈ వివరాలు వెల్లడించింది. " జమ్మూ కాశ్మీర్ పర్యటనకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిల్ కే నరేంద్రన్, జస్టిస్ పీజీ అజిత్ కుమార్, జస్టిస్ జి.గిరీష్.. ఎమ్మెల్యేలు ముకేశ్, కేపీఏ మజీద్, టి. సిద్ధిక్, కె.అన్నాలన్ వెళ్లారు. ఉగ్రవాదుల దాడి నుంచి తృటిలో తప్పించుకున్నారు. ప్రస్తుతం శ్రీనగర్‌లో ఉన్నారు. వీరంతా సురక్షితంగా ఉన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో చిక్కుకున్న ప్రజలను సురక్షితంగా రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం " అని వెల్లడించింది. ఈ ఘటనపై సిఎం పినరయి విజయన్ విచారం వ్యక్తం చేశారు. " ఎర్నాంకులమ్‌కు చెందిన వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. అతడి కుటుంబసభ్యులను జాగ్రత్తగా ఇంటికి చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తాం " అని ముఖ్యమంత్రి తెలిపారు" అని సీఎంవో పేర్కొంది. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో కొచ్చిలోని ఎడపల్లికి చెందిన ఎన్. రామచంద్రన్ ప్రాణాలు కోల్పోయారు. కాగా.. పహల్గాం సమీప బైసరన్ లోయలో సైనికుల దుస్తుల్లో వచ్చిన అయిదుగురు ముష్కరులు పురుషులే లక్ష్యంగా దాడులు చేశారు. ఈ దాడుల్లో 28 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

## న్యూజెర్సీ నుండి 3,000 మంది నివాసితుల తరలింపు




న్యూయార్క్ : అమెరికాలోని న్యూజెర్సీలో కార్చిచ్చు వ్యాపించడంతో సుమారు 3,000మంది నివాసితులను ఖాళీ చేయించారు. కార్చిచ్చుతో వేలాది ఎకరాలు దగ్ధమయ్యాయని, వందలాది నిర్మాణాలకు ముప్పు కలిగిస్తోందని రాష్ట్ర అగ్నిమాపక దళం మంగళవారం తెలిపింది. రాత్రి 10.30 గంటలకు ఓషన్ కౌంటీలో కార్చిచ్చు ప్రారంభమైందని, పది శాతం అదుపులోకి వచ్చాయని న్యూ జెర్సీ ఫారెస్ట్ ఫైర్ సర్వీస్ సోషల్‌మీడియా ఖాతా ఎక్స్‌లో పేర్కొంది. 3,200 ఎకరాల్లో మంటలు చెలరేగాయని మొదట నివేదించింది. రెండు గంటల అనంతరం మంటలు 8,500 ఎకరాల (3,440 హెక్టార్లు)కు వ్యాపించాయని పేర్కొంది. అగ్నిమాపక యంత్రాలు, బుల్డోజర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందితో పాటు అనేక మంది అగ్నిమాపక, రెస్క్యూ సిబ్బందిని మోహరించినట్లు అగ్నిమాపక సంస్థ తెలిపింది. కార్చిచ్చు చెలరేగడానికి గల కారణాలపై విచారణ చేపడుతున్నట్లు వెల్లడించింది. ఈ అంశంపై బుధవారం మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. అమెరికా తూర్పు తీరంలో అతిపెద్ద రక్షిత ప్రాంతాలలో ఒకటైన పైన్ బారెన్స్‌లో మంటలు చెలరేగాయని స్థానిక మీడియా తెలిపింది. న్యూజెర్సీని కరువు ప్రాంతంగా రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ శాఖ మార్చిలో ప్రకటించింది. కార్చిచ్చుతో సుమారు 25,000 మందికి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని జెర్సీ సెంట్రల్ పవర్ అండ్ లైట్ ఎక్స్‌లో పేర్కొంది. కార్చిచ్చు కారణంగా న్యూజెర్సీ రాష్ట్రం గుండా వెళ్లే గార్డెన్ స్టేట్ పార్క్‌వేలోని ఒక విభాగాన్ని కూడా మూసివేసినట్లు తెలిపారు.

## టెన్త్ ఫలితాల్లో రికార్డు.. 600కు 600 మార్కులు



| | |
|---|---|
| Hall Ticket Number | 2507103274 |
| Name | YALLA NEHANJANI |
| Result | FIRST DIVISION |
| Grand Total | 600 |
| PH - Description | |
| PH - Code | |
| District | KAKINADA |
| District Code | 07 |

| Subject | FLAG | MARKS | RESULT |
|---|---|---|---|
| Language I | | 100 | P |
| Language II | | 100 | P |
| Language III | | 100 | P |
| Maths | | 100 | P |
| Science | | 100 | P |
| Social | | 100 | P |
| Optional Language | | | |



అమరావతి: ఎపిలో పదో పరగతి పరీక్షల ఫలితాల్లో కాకినాడ విద్యార్థిని చరిత్ర సృష్టించింది. ఇప్పటివరకూ ఎవరికీ సాధ్యం కాని అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకుంది. బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో కాకినాడకు చెందిన విద్యార్థిని యల్ల నేహాంజని 600కు 600 మార్కులు సాధించింది. వందకు వందశాతం మార్కులు తెచ్చుకున్న తొలి విద్యార్థినిగా నేహాంజని నిలిచింది. దీంతో ఆమెపై అందరూ ప్రశంసలు కురిపిస్తున్నారు. కాగా.. ఎపి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం టెన్త్ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడారు. ఈ సంవత్సరం 6,14,459 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 4,98,585 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 81.14 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలియజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా 93.90% ఉత్తీర్ణతతో తొలి స్థానంలో ఉందని, 1,680 పాఠశాలలు 100% ఫలితాలు సాధించాయని ఆయన ప్రశంసించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ మంత్రి లోకేష్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విజయం సాధించని విద్యార్థులు నిరుత్సాహపడవద్దని, జీవితంలో రెండో అవకాశం కూడా ఉంటుందని చెప్పారు. సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 28 వరకు జరుగుతాయని, విజయం సాధించడానికి మరొక అవకాశాన్ని అందిస్తున్నామని లోకేష్ వివరించారు.

# పురాతన ఆలయాలకు నిలయం.. పిల్లలమర్రి

### చరిత్రకు సజీవ సాక్ష్యం ఆదరణలేక శిథిలమవుతున్న శిల్పకళా సంపద పట్టించుకోని ప్రభుత్వం


తాళ్లగడ్డ (సూర్యాపేట): పిల్లలమర్రి ఆ పేరు వింటే నే చారిత్రక కట్టడాలు గుర్తుకువస్తాయి. ఆధ్యాత్మిక భావం ఉప్పొంగుతుంది. ఇక్కడ కాకతీయుల కాలంలో నిర్మించిన నామేశ్వర, ఎరకేశ్వర దేవాలయాలు దశాబ్దాలు దాటినా నేటికీ శిల్పకళా సంపద చరిత్రకు సజీవసాక్ష్యంగా నిలిచాయి. గొప్ప కళాకృతుల సౌందర్యం ఉట్టిపడే ఈ ఆలయాలకు నేడు ఆదరణ కరువైంది. పాలకులు పట్టించుకోకపోవడంతో భావితరాలకు అందించాల్సిన ఆధ్యాత్మిక సంపదకు రక్షణ లేకుండాపోయింది. ప్రభుత్వం చొరవ చూపి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని భక్తులు కోరుతున్నారు.

### నామేశ్వర ఆలయ నిర్మాణ వృత్తాంతం

కాకతీయ రాజు గణపతిదేవుడి పరిపాలనా కాలంలో రేచర్ల నామిరెడ్డి ప్రస్తుతం పిల్లలమర్రి గ్రామం ఉన్న ప్రాంతానికి సామంతరాజుగా ఉండేవారు. వీరు శైవారాధికులు కావడంతో 11వ శతాబ్దంలో మూసీ నది పరీవాహక ప్రాంతంలో ఆయన పేరు మీద పార్వతీ మహాదేవ నామేశ్వర దేవాలయాన్ని నిర్మించారు. ఇక్కడి శివలింగాలు బ్రహ్మసూత్రం కలిగి ఉండటం విశేషం. కాకతీయుల కాలంలో నిర్మించిన శివాలయాలకు మాత్రమే ఈ బ్రహ్మసూత్రం ఉంటుంది.

### ఎరకేశ్వర ఆలయ వృత్తాంతం

12వ శతాబ్దంలో రేచర్ల బేతిరెడ్డి నామేశ్వర ఆలయంలో పూజలు చేసి పరిసర ప్రాంతంలో సంచరిస్తుండగా.. వేటకు వచ్చిన ఎరుకల వ్యక్తి అక్కడ ఉన్న ఒకపెద్ద ఊడల మర్రిచెట్టు కింద సేద తీరుతున్నాడు. ఆ సమయంలో ఆ చెట్టు పైన ఉన్న పిట్టలు.. మరి కొన్నాళ్లకు ఈ చెట్టు కూలుతుందని దీని కింద అనంత నిధి నిక్షిప్తమై ఉందని మాట్లాడుకోవడాన్ని విన్నాడు. వీరు అడవిలో ఉండటం పక్షులతో సావాసం కారణంగా ఆ మాటలు ఎరుకల వ్యక్తికి అర్థంకావడంతో వేటగాడు స్పందించాడు. దీంతో ఆ పక్షులు ఈ విషయాన్ని ఎవరికైనా చెప్తే తల పగిలి చస్తావ్ అని శపిస్తాయి. ఇది గమనించిన బేతిరెడ్డి రాజు ఎరుకల వారిని విషయం చెప్పాల్సిందిగా కోరగా శాప భయంతో వేటగాడు సంకోచిస్తుండగా చెప్పకుంటే మరణ శిక్ష విధిస్తానన్నాడు. చెప్పినా చెప్పకపోయినా ప్రాణం పోతుందని భావించిన వేటగాడు రాజును ఓ కోరిక కోరతాడు. తన పేరున ఆలయం నిర్మిస్తే పక్షులు మాట్లాడుకున్న విషయం చెబుతానని రాజుతో అంటాడు. అప్పుడు రాజు అందుకు అంగీకరిస్తాడు. దీంతో పక్షులు ఏం మాట్లాడుకున్నాయో రాజుకు వివరించి ఆ ఎరుకలివాడు మరణిస్తాడు. కొంతకాలానికి ఆ మర్రి చెట్టు కూలి అక్కడ పెద్ద గొయ్యి ఏర్పడింది. అందులో 7 కొప్పెర్ల నిధి (ఆనాటి కొలతల ప్రకారం) బయటపడుతుంది. ఆ ధనంతో ఎరకేశ్వర ఆలయం నిర్మించారు. దానికి ఎరుకల వాని పేరు పెట్టినట్లు తెలుస్తోంది. అలాగే దీనికి మరో వృత్తాంతం కూడా ప్రచారంలో ఉంది. రేచర్ల బేతిరెడ్డి భార్య ఎరకసానమ్మ ఆలయం నిర్మించిందని ఆమె పేరు మీద ఎరకేశ్వరాలయం పేరు వచ్చిందని కొందరి విశ్వాసం. ఆలయ నిర్మాణానికి ముందు ఇక్కడ ఉన్న పెద్ద మర్రిచెట్టు ఊడలు పోసుకొని



పెద్దగా విస్తరించడంతో ఈ గ్రామానికి పిల్లలమర్రి అని పేరు వచ్చింది.

### ఆలయ నిర్మాణ శైలి.. శిల్పకళా సౌందర్యం

నామేశ్వర ఆలయాన్ని చతురస్రాకారంలో, ఎరకేశ్వరాలయాన్ని శ్రీచక్రం ఆకారంలో రాతితో నిర్మించారు. ఇవి కాకతీయుల కాలం నాటి సంస్కృతిని, శిల్పసంపదను ప్రతిబింబిస్తున్నాయి. గర్భాలయం, అంతరాలయం తోరణాలు నల్లని (క్రిష్ణశిల) ఏకశిలతో నిర్మించడం విశేషం. ఈ ఆలయాల్లో శివలింగం ఎదురుగా నందీశ్వరుడు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎక్కడా లేని విధంగా నందిని ఆలయంపైన గోపురం ముందు ప్రతిష్టించారు. రేచర్ల రాజులు నాట్య కళాప్రియులు కావడంతో ఆలయాల్లో గర్భగుడి ఎదురుగా నందీశ్వరునికి బదులుగా నాట్యమండపం నిర్మించారు. నాట్యమండపం నిర్మాణానికి ఏర్పాటు చేసిన స్తంభాలపై చెక్కిన నాట్య శిల్పకళా రూపాలు సౌందర్యవంతంగా దర్శనమిస్తున్నాయి. ఈ స్తంభాల నుంచి సప్తస్వరాలు వినిపించేలా నిర్మించడం విశేషం.

### బ్రహ్మసూత్రంతో శివలింగం

సాధారణంగా అన్ని శివలింగాల మీద గీత ఉండదు కేవలం కాకతీయుల కాలంలో నిర్మించిన కొన్ని శివలింగాలకు మాత్రమే బ్రహ్మసూత్రం అనే గీత ఉంటుంది. బ్రహ్మసూత్రం ఉన్న ఆలయంలో ఒక్కసారి రుద్రాభిషేకం, జపం, ఇత్యాది పూజా కార్యక్రమాలు నిర్వహిస్తే కోటి సార్లు చేసిన పుణ్యఫలం లభిస్తుందని, ఇలాంటి శివలింగాన్ని దర్శిస్తే జన్మ ధన్యమవుతుందని భక్తుల నమ్మకం.

### ధ్వంసమైన కళారూపాలు

వందల ఏళ్ల కిందట వచ్చిన అతిపెద్ద భూకంపం వల్ల శివలింగాలు ఉత్తరం వైపుగా ఒరిగాయి. ఆలయాలు కదలడంలో ఆలయ ప్రాకారాలు పైకప్పు జరిగిన ఆనవాళ్లు నేటికీ కనిపిస్తున్నాయి. నామేశ్వరాలయం నుంచి సూర్యాపేట బర్లపెంట బజార్‌లోని శ్రీఅన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి దేవాలయం వరకు సొరంగ మార్గం ఉంది. భూకంపం ప్రభావంతో కాలక్రమేణా పూర్తిగా పూడిపోయింది. పిల్లలమర్రి గ్రామంలో ఉన్న విఘ్నేశ్వరాలయం కాలగర్భంలో కలిసిపోయింది.

### ఏటా శివరాత్రికి జాతర

శివరాత్రి ఉత్సవాల సందర్భంగా పిల్లలమర్రిలో 5 రోజుల జాతర.. శివరాత్రికి ఒకరోజు ముందు ప్రారంభం అవుతుంది. మొదటి రోజు గణపతి పూజతో మొదలుకొని రెండోరోజు శివరాత్రి లింగోద్భవకాలంలో కల్యాణం, మూడోరోజు రథోత్సవం, నాలుగవరోజు అగ్నిగుండాలు, చివరి రోజున సాయంత్రం త్రిశూల స్నానం, ఏకాంత సేవ నిర్వహణతో జాతర ముగుస్తుంది.

### భారీగా భక్తుల రాక

సూర్యాపేటకు ఆనుకుని ఉండటం, విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారికి చేరువలో ఉండటంతో జాతర సమయంలో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. చుట్టుపక్కల జిల్లాలతో పాటు తమిళనాడు రాష్ట్రం నుంచి కూడా భక్తులు రావటం విశేషం.

### పట్టించుకోని ప్రభుత్వం

ఈ ఆలయాలకు ఆదరణ కరువైంది. వర్షాకాలంలో నీళ్లు కారుతూ పాకురుపట్టింది. శిథిలావస్థకు చేరువలో ఉంది. ఆదాయం తక్కువగా ఉందని ఆర్థిక మిగులు బాటు లేదని ప్రభుత్వం దేవాదాయశాఖ పట్టించుకోకపోవడం శోచనీయం.

### ఆలయ ప్రాంగణంలో మంచినీటి బావులు..

ఇక్కడ మంచినీటి బావులకు ప్రత్యేక స్థానం ఉంది. 11వ శతాబ్దంలో రేచర్ల రాజులు బావులు తవ్వించారు. నాటి నుంచి నేటి వరకు అదే నీటితో అభిషేకాలు చేస్తున్నారు. కరువులోనూ ఈ బావులు ఎండకపోగా.. గ్రామస్తులు, రైతులు ఈ నీటిని తోడినా మళ్లీ అదే స్థాయిలోకి నీరు ఉండటం విశేషం. కరువు కాలంలో పక్కన ఉన్న మూసీ నది, చెరువులు అడుగంటినా ఈ బావి నీటిమట్టం తగ్గకపోవటం విశేషం.

### త్రికూటేశ్వరాలయం..

త్రికూటేశ్వరాలయం, సరస్వతీదేవి సమేత బ్రహ్మ దేవాలయాలను రేచర్ల బేతిరెడ్డి భార్య ఎరకసానమ్మ నామేశ్వర దేవాలయం ప్రాంగణంలోనే నిర్మించారు. త్రికుటేశ్వరాలయంలో మూడు శివలింగాలు ఒకే నందీశ్వరునితో ప్రతిష్టించారు. ఇక్కడి నంది ఉత్తరం వైపుగా తలతిప్పి ఉంటుంది. ఎడమ కన్నుతో దక్షిణ, పడమర ఆలయంవైపు కుడి కన్నుతో ఉత్తరం వైపు ఉన్న ఆలయాన్ని చూస్తున్నట్లుగా ఉంటుంది. అన్ని శివాలయాలలో ప్రాణమట్టాలు ఉత్తరంవైపుగా ఉంటాయి. కానీ ఈ త్రికుటేశ్వరాలయంలో మాత్రం ఎదురుగా ఉన్న ఆలయంలో ఉత్తరం వైపు, ఉత్తరం, దక్షిణం వైపు ఉన్న ఆలయాల్లో మాత్రం తూర్పువైపుగా ప్రాణమట్టాలు ఉన్నాయి.

### ప్రపంచంలోఈ విగ్రహం ఒక్కటే..

సరస్వతీదేవి సమేత బ్రహ్మ ఆలయంలో నెమలి వాహనంపై బ్రహ్మ సరస్వతీదేవి ఏకశిలపై ఒకే విగ్రహంగా దర్శనమిస్తారు. ప్రపంచంలో ఇలాంటి విగ్రహం ఇది ఒక్కటి మాత్రమే ఉండటం విశేషం. కవి పిల్లలమర్రి పినవీరభద్రుడు అమ్మవారిని దర్శించి కటాక్షం పొంది కవిగా ప్రసిద్ధి చెందాడని నానుడి. పిల్లలమర్రి గ్రామంలో పురాతన శ్రీచెన్నకేశవస్వామి ఆలయం, హనుమ ఆలయాలు కూడా ఉన్నాయి.

### ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి

పిల్లల మర్రి ఆలయాలకు 12 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిపై వచ్చే ధనాన్ని వెచ్చించి ధూపదీప నైవేద్యం కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విజయవాడ-హైదరాబాద్ రహదారికి ఖమ్మం బైపాస్‌కి పిల్లలమర్రి గ్రామం మీదుగా లింక్ రోడ్డు వేస్తే భక్తుల రాకపోకలకు, ఆలయాభివృద్ధికి దోహదపడుతుంది. భక్తుల కోసం వసతి గృహాలు కట్టిస్తే బాగుంటుంది. వర్షాకాలంలో నీరు కారి ఆలయ పైకప్పు ప్రాకారాలు పాకురు పడుతున్నాయి. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి.

## విధివిధానాలు అధికారికంగా ఖరారు ప్రధాని మోదీ అప్రూవల్ రేటింగ్స్ చూస్తే నాకు అసూయగా ఉంది అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్

జైపూర్: భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్ట ప్రపంచవ్యాప్తంగా నానాటికీ పెరుగుతోందని, ఆయనను చూస్తే అసూయగా ఉందని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ చెప్పారు. మోదీ ప్రభుత్వాన్ని కొందరు విమర్శిస్తున్నప్పటికీ ఆయన పేరు ప్రతిష్టలు మరింత ఇనుమడిస్తున్నాయే తప్ప ఎక్కడా తగ్గడం లేదన్నారు. అంతర్జాతీయంగా మోదీకి లభిస్తున్న అప్రూవల్ రేటింగ్స్ తనకు అసూయ కలిగిస్తున్నాయని, ఈ విషయం సోమవారం నేరుగా మోదీకే చెప్పానని వెల్లడించారు. 'మోదీ స్పెషల్ పర్సన్' అని ప్రశంసించారు. మంగళవారం రాజస్తాన్ రాజధాని జైపూర్‌లో రాజస్తాన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఓ సదస్సులో వాన్స్ ప్రసంగించారు. ప్రధానంగా ఇండియా-అమెరికా సంబంధాలపై మాట్లాడారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం విషయంలో తుది ఒప్పందంపై రోడ్‌మ్యాప్ సిద్ధమైందని ప్రకటించారు. రోడ్‌మ్యాప్‌పై విధివిధానాలను ఇరు దేశాలు అధికారికంగా ఖరారు చేశాయని వెల్లడించారు. భారతదేశ ఉత్పత్తులపై విధించిన 26 శాతం ప్రతీకార సుంకాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 90 రోజులపాటు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. వాణిజ్య ఒప్పందంపై రోడ్‌మ్యాప్ సిద్ధం కావడం డొనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీల విజన్ వాస్తవరూపం దాల్చే విషయంలో ఒక కీలకమైన ముందడుగు అని వాన్స్ అభివర్ణించారు. భారత్-అమెరికా సంయుక్తంగా ప్రగతి సాధించాలని ట్రంప్ కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ 'కొరుకుడుపడని కఠినమైన సంధానకర్త' అని అభివర్ణించారు. ఆయనతో బేరం తేల్చడం అంత సులభం కాదన్నారు. అందుకే అమెరికా ఆయనను గౌరవిస్తోందని వ్యాఖ్యానించారు.

## వాణిజ్య ఒప్పందంపై రోడ్‌మ్యాప్ సిద్ధం




### మిత్రుడిగా వచ్చా..

తాను ఇండియాకు నీతిబోధలు చేయడానికి రాలేదని, ఒక భాగస్వామిగా, మిత్రుడిగానే వచ్చానని జె.డి.వాన్స్ అన్నారు. ఏ పని ఎలా చేయాలో ఇండియాకు నేర్పే ఉద్దేశం తనకు లేదన్నారు. గతంలో అమెరికా ప్రభుత్వాలు భారత్‌కు నీతి పాఠాలు బోధించేందుకు ప్రయత్నించేవని, భారత్‌ను చౌకగా కార్మిక శక్తి లభించే దేశంగానే చూసేవారని చెప్పారు . ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయిందని పేర్కొన్నారు. అమెరికా ఉత్పత్తులను మరింత అధికంగా కొనుగోలు చేయాలని భారత్‌కు విజ్ఞప్తిచేశారు. అమెరికా ఇంధన, రక్షణ ఉత్పత్తులు, పరికరాలను ఎక్కువగా కొనుగోలు చేయాలన్నారు. రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. టెక్నాలజీ, రక్షణ, వాణిజ్యం, ఇంధనం వంటి వేర్వేరు కీలక రంగాల్లో భారత్, అమెరికా కలిసికట్టుగా పనిచేస్తే అద్భుత విజయాలు సాధించవచ్చని పిలుపునిచ్చారు. ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా 'ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం'పై ఇరుదేశాలు చర్చలు కొనసాగిస్తున్నాయని తెలిపారు.


### ఇవాన్ ఇండియాలోనే ఉంటానన్నాడు

ప్రధాని మోదీ తమకు చక్కటి ఆతిథ్యం ఇచ్చారని జె.డి.వాన్స్ ఆనందం వ్యక్తంచేశారు. మోదీ ప్రేమానురాగాలు తమ కుటుంబాన్ని ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. ముఖ్యంగా తమ ముగ్గురు పిల్లలకు మోదీ ఎంతో ఆత్మీయులయ్యారని తెలిపారు. మోదీ ఇచ్చిన విందు తన కుమారుడు ఇవాన్‌కు ఎంతోగానో నచ్చిందని, ఇండియాలోనే ఉండిపోవాలని కోరుకుంటున్నట్లు ఇవాన్ తనతో చెప్పాడని అన్నారు. తన పిల్లలకు డొనాల్డ్ ట్రంప్‌తో ఏర్పడిన అనుబంధం ఇప్పుడు మోదీతోనూ ఏర్పడిందని వ్యాఖ్యానించారు. ఇండియాలో తన కంటే తన భార్య ఉషా చిలుకూరికే గొప్ప ఆదరణ లభిస్తోందని వాన్స్ చమత్కరించారు.

### అంబర్ కోట సందర్శన

వాన్స్ తన భార్య ఉషా చిలుకూరి, ముగ్గురు పిల్లలతో కలిసి మంగళవారం ఉదయం రాజస్తాన్‌లోని చరిత్రాత్మక అంబర్ కోటను సందర్శించారు. వాన్స్ కుటుంబానికి రాజస్తాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, ఉప ముఖ్యమంత్రి దియా కుమారీతోపాటు అధికారులు సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. చక్కగా అలంకరించిన ఏనుగులు, తీర్చిదిద్దిన రంగవల్లులు, జానపద నృత్యాలతో అమెరికా ఉపాధ్యక్షుడికి ఆత్మీయ స్వాగతం లభించింది. చందా, మాలా అనే రెండు ఏనుగులు తొండాలు ఎత్తి వాన్స్ కుటుంబానికి స్వాగతం పలికాయి. రాజస్తానీ సంప్రదాయ జానపద నృత్యాలు అలరించాయి.

# ప్రాజెక్టు..హిందూత్వ!



దేశవ్యాప్తంగా ప్రజలందరికీ ఒకే గుడి, ఒకే బావి, ఒకే శ్మశాన వాటికలకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ ఆదివారం తన అలీగఢ్ పర్యటనలో ఇచ్చిన పిలుపు రాజ్యాంగాన్ని సవాల్ చేయడమే అవుతుంది. సంఘ్ మూల సిద్ధాంతం హిందూ రాష్ట్ర స్థాపన దిశకు నడిపించడంగా పరిగణించాలి. భగవత్ విద్వేష వ్యాఖ్యలను రాజ్యాంగాన్ని ఆమోదించే, లౌకిక, ప్రజాస్వామ్యాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ ముక్త కంఠంతో ఖండించాలి. దేశంలో మత విభజనకు ఒడిగట్టి భగవత్ ఇంతగా బరితెగించి విషం కక్కడం మోడీ ప్రభుత్వ అండతోనే సాధ్యమవుతుంది. దేశ సమైక్యతకు, సమగ్రతకు విఘాతం కలిగించే వారిపై దేశ ద్రోహం వంటి కఠిన సెక్షన్ల కింద కేసులు పెట్టి జైలుకు పంపాలి. భగవత్‌పై అది జరగలేదంటేనే బీజేపీ, మోడీ ప్రభుత్వ మద్దతు ఏ స్థాయిలో ఉందో తేటతెల్లమవుతోంది. భారత దేశం విభిన్న మతాలు, కులాలు, జాతుల సమాహారం. భిన్నత్వంలో ఏకత్వం మన సంస్కృతి, సంప్రదాయం, వారసత్వం. ఈ సామాజిక వైవిధ్యంగానే లౌకిక రాజ్యంగా భారత్ అవతరించింది. రాజ్యాంగ స్వరూపానికి అదే పునాది. ఆసేతు హిమాచలం ప్రజలందరినీ దండలో దారంలా కలిపి ఉంచుతున్నదిదే. ఈ వ్యవస్థను విధ్వంసం చేయాలన్నది సంఘ్ చిరకాల వాంఛ. దానిలోనుంచి పుట్టినదే తాజాగా భగవత్ నోటినుంచి ఆవిష్కృతమైన విద్వేష 'సందేశం'. ఆరెస్సెస్‌కు బీజేపీ రాజకీయ విభాగం అన్నది బహిరంగ రహస్యం. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చాక సంఘ్ మార్గదర్శకత్వంలోనే ప్రభుత్వం పని చేస్తోందనడానికి కేబినెట్ కూర్పు సహా పలు దృష్టాంతాలు కనిపిస్తాయి. ఎప్పటికప్పుడు నాగపూర్‌లోని సంఘ్ హెడ్‌క్వార్టర్‌కు ప్రోగ్రెస్ రిపోర్టులను సమర్పించి దిశా నిర్దేశాలను స్వీకరించడం తెలిసిందే. బీజేపీ సర్కారు రెండవ తడవ పాలనా పగ్గాలు చేపట్టిన వెంటనే 370 ఆర్టికల్‌ను రద్దు చేసినా, మూడోసారి పీఠం ఎక్కాక ముస్లింల లక్ష్యంగా వక్ఫ్ సవరణ చట్టాన్ని బుల్డోజ్ చేసినా సంఘ్ దీర్ఘకాలిక హిందూ రాజ్యస్థాపన ప్రాజెక్టులో భాగమే. ఒకే దేశం- ఒకే ఎన్నిక, ఒకే దేశం- ఒకే భాష, ఏక రూప పౌరస్మృతి, నూతన విద్యా విధానం.. ఇటువంటివన్నీ ఆరెస్సెస్ కర్మాగారంలో తయారైనవే. జమిలి ఎన్నికలనే తీసుకుంటే తమకు లోక్‌సభలో, రాజ్యసభలో మెజార్టీ లేకపోయినా ఆర్ఎస్ఎస్ అభిలాషకను గుణంగా జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)వరకు వెళ్లింది. ఆరెస్సెస్ రెండవ చీఫ్ గోల్వాల్కర్ తన సైద్ధాంతిక గ్రంథంలో ఒకే ఎన్నిక ప్రతిపాదన చేశారు. ఆ తోవకు మోడీ సర్కారు ప్రయత్నాలు ముమ్మరం కావిస్తోంది. ఈ మధ్యనే మోహన్ భగవత్ మసీదులను కూల్చి దేవాలయాలు నిర్మించడం, మసీదు లోపల శివలింగాలను కనుగొనడం మాను కోవాలని తమ శాఖలకు సూక్తి ముక్తావళి పఠించారు. అయోధ్య అనేది ప్రత్యేక పరిస్థితుల్లో తీసుకున్నదని, అది విజయవంతమైందని సెల విచ్చారు. అంతలోనే ప్రజలందరికీ ఒకే గుడి, బడి, వల్లకాడు అంటున్నారు. ఆరెస్సెస్‌ది రెండు నాల్కల విధానమని, గోముఖ వ్యాఘ్రమని ఈ ఉదంతంతో రూఢ అవుతుంది. అయోధ్యపై సుప్రీంకోర్టు తీర్పు వచ్చినప్పుడు, తదుపరి వంతు మధుర, కాశీ అన్నారు. ఇటీవలనే జైపూర్ దర్గా హిందువులదన్న వివాదం లేవదీశారు. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో మసీదు కింద ఆలయం ఉందని సర్వే పేరిట నానా యాగీ చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని కులం మన దేశంలో వేల ఏళ్లుగా వేళ్లూనుకుంది. హిందూ మత రాజ్య స్థాపనకు కులం అవరోధమని ఆరెస్సెస్ ఎప్పుడో గుర్తించింది. కుల విభేదాలొద్దని భగవత్ చెప్పే సుద్దులు తన లక్ష్య సాధనలోనివే. జాతీయ ఐక్యత, సామాజిక ఏకత్వం, సామూహికంగా హిందూ పండగల నిర్వహణ..ఇవన్నీ హిందూ రాష్ట్ర ప్రాజెక్టులోనివే. తన వందేళ్ల ప్రస్థానంలో వీటినే ఆరెస్సెస్ నమ్ముకొని అవకాశం చిక్కినప్పుడల్లా వాటిపై కేంద్రీకరించి పని చేస్తోంది. భగవత్ విద్రోహ వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలి. కేంద్రంలో మోడీ మనుగడకు భుజం కాసే పార్టీలు తమ వైఖరి చెప్పాలి. దేశ ఐక్యతను సవాల్ చేస్తున్న సంఘ్‌ను ఒంటరి చేసి దోషిగా నిలబెట్టేందుకు లౌకిక, ప్రజాస్వామిక వాదులు నడుం కట్టాల్సిన సమయమిది.

## జనతా గ్యారేజ్‌లా తెలంగాణ భవన్: కేటీఆర్



హన్మకొండ,: తెలంగాణలో కష్టం అనే మాట వినబడితే.. బాధితులకు అండగా నిలబడేది గులాబీ జెండా ఒక్కటేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల రామారావు అన్నారు. బుధవారం ఎల్కతుర్తితో పర్యటించిన ఆయన.. బీఆర్ఎస్ రజతోత్సవ సభా ఏర్పాట్లను పర్యవేక్షించి మీడియాతో మాట్లాడారు. ముందుగా.. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి బీఆర్ఎస్ నేతలంతా నివాళులర్పించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ ప్రజల్ని రెచ్చగొట్టడానికో, ప్రభుత్వ వ్యతిరేకతను పెంచడానికి కాదని.. 25 వసంతాలు పూర్తి చేసుకున్నందున జరుపుకొనే వేడుక మాత్రమేనని తెలిపారాయన. ఇక్కడ 1,250 ఎకరాల్లో సభా స్థలం ఉండగా.. వెయ్యి ఎకరాలు పార్కింగ్ కోసం కేటాయించాం. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే ఏ ఒక్కరికీ ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేస్తున్నాం. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య తాగునీటి వసతి కల్పిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటుపై నమ్మకం లేనందున జెనరేటర్లు ఏర్పాటు చేశాం. బీఆర్ఎస్ చరిత్రలో ఇది భారీ బహిరంగ సభ కాబోతుంది. గతంలో ఉద్యమ పార్టీగా ప్రతిపక్షంగా, ప్రభుత్వంలో ఎక్కడ ఉన్నా తెలంగాణ కీర్తిని హిమాలయాల స్థాయికి తీసుకెళ్లిన ఘనత కేసీఆర్‌దేనని కేటీఆర్ అన్నారు. 14 ఏళ్ల పాటు నిర్విరామంగా పోరాటం చేసి అన్ని వర్గాలను సమీకరించి రాష్ట్ర సాధన ఉద్యమం చేసిన పార్టీ బీఆర్ఎస్. తెలంగాణ ప్రజల గుండె ధైర్యం బీఆర్ఎస్. గులాబీ జెండా అన్ని వర్గాలకు అండగా ఉంటుందనే పద్ధతిలో ప్రజలు గులాబీ జెండా వైపు చూస్తున్నారు. ఏ సమస్య వచ్చినా తెలంగాణ భవన్ వైపు చూస్తున్నారు. తెలంగాణ భవన్ ఒక జనతా గ్యారేజ్‌లా మారింది" అని కేటీఆర్ అన్నారు.

## జానారెడ్డి ఎపిసోడ్.. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రియాక్షన్



హైదరాబాద్: గాంధీ భవన్‌లో ఇంఛార్జి మీనాక్షి నటరాజన్‌తో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇవాళ భేటీ అయ్యారు. వారం క్రితం జానారెడ్డిపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తనకు మంత్రి పదవి రాకుండా మాజీ మంత్రి జానారెడ్డి ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నాడంటూ తీవ్ర వ్యాఖ్యలే చేశారాయన. అయితే, జానారెడ్డి ఎపిసోడ్‌పై రాజగోపాల్‌రెడ్డి.. బుధవారం స్పందించారు. "జానారెడ్డి అంటే నాకు గౌరవం. ఆయన మా పార్టీ సీనియర్ నేత. జానారెడ్డి రాసిన లెటర్‌పై ఒక సభలో మాట్లాడాను. మంత్రి పదవి పార్టీ తీసుకోవాల్సిన నిర్ణయం" అంటూ రాజగోపాల్‌రెడ్డి చెప్పుకొచ్చారు. కాగా, మంత్రి వర్గ విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి గట్టి హెచ్చరికలే చేశారు. పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారు. సీఎల్పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదవులు ఎవరికి ఇవ్వాలనేది అధిష్టానం చూసుకుంటుంది. .మంత్రి పదవి కోరే వాళ్లు మాట్లాడితే వారికే నష్టం. ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు. అలా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు" అంటూ రేవంత్ తేల్చి చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదన్నారు.

## ఉరి, పుల్వామా కంటే ఘోరమైన దాడి ఇది: ఒవైసీ



న్యూఢిల్లీ: ఉరి, పుల్వామాలలో జరిగిన దాడుల కంటే.. జమ్ము కశ్మీర్ పహల్గాం లో తాజాగా జరిగిన ఉగ్ర దాడి అత్యంత ఘోరమైందని, అది తనను ఎంతగానో బాధించిందని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. నిఘా వ్యవస్థ వైఫల్యం వల్లే దాడి జరిగిందన్న ఆయన.. ఘటనకు మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. "పహల్గాంలో.. మతం ఏంటని అడిగిన తర్వాతే ఉగ్రవాదులు అమాయక ప్రజలను విచక్షణారహితంగా చంపారు. ఇది గతంలో జరిగిన ఉరి, పుల్వామా ఉగ్రదాడుల కంటే ఘోరమైంది. ఈ దాడిని మేం ఖండిస్తున్నాం. ఇది కచ్చితంగా నిఘా వ్యవస్థ వైఫల్యమే. జమ్ములో ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిరోధక విధానం పనిచేస్తుందో లేదో పరిశీలించుకోవాలి. ఈ ప్రభుత్వం ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పి.. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తుందని ఆశిస్తున్నాం" అని విలేకరులతో అన్నారాయన. దక్షిణ జమ్ము కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలోని బైసరన్ లోయలో ఘోరం జరిగింది. సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు.. మైదానంలో కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతున్న పర్యాటకులను చుట్టుముట్టి తుపాకులతో దారుణంగా కాల్చి చంపారు. ఐడీ కార్డులను పరిశీలించి.. పేరు, మతం ఆధారంగా వేరు చేసి మరీ దాడి చేశారు. ఈ దాడిలో 26 మంది అక్కడికక్కడే మరణించగా.. తీవ్రంగా గాయపడి మరికొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వాళ్లలో ఇద్దరు తాజాగా మరణించడంతో మృతుల సంఖ్య 28కి చేరింది. అయితే.. బాడీ కేమ్ ద్వారా దాడి దృశ్యాలను పాక్‌లోని తమ హ్యాండర్లకు ఉగ్రవాదులు చేరవేసినట్లు భద్రతా సంస్థలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే ఉగ్రవాదుల ఫొటోలు, ఊహా చిత్రాలు విడుదల చేసి.. జమ్ము వ్యాప్తంగా గాలింపు కొనసాగిస్తోంది.

## ఉగ్రవాదానికి భారత్ తలొగ్గదు.. వారిని వదిలిపెట్టబోం



న్యూఢిల్లీ: జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా నివాళులర్పించారు. బుధవారం ఉదయం శ్రీనగర్‌కు చేరుకున్న అమిత్ షా.. పుష్పగుచ్ఛం సమర్పించి వారికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఎక్స్ ఖాతాలో ఆయనొక పోస్ట్ ఉంచారు. భారమైన హృదయంతో పహల్గాం ఉగ్రదాడి మృతులకు నివాళులు. భారత్ ఉగ్రవాదానికి తలొగ్గదు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని వదిలిపెట్టబోం. బాధితుల ఆవేదనను ప్రతీ భారతీయుడు అనుభవిస్తున్నాడు అని ట్వీట్ చేశారాయన. పహల్గాం ఉగ్రదాడి సమాచారం అందుకున్న వెంటనే మంగళవారమే అమిత్ షా జమ్ము కశ్మీర్ చేరుకున్నారు. బుధవారం ఉదయం మృతులకు నివాళులర్పించిన అనంతరం.. బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించారు. ఆ సమయంలో బాధిత కుటుంబాలు కన్నీళ్లతో షాను వేడుకుంటున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. ఈ సందర్భంగా.. ఘటన వెనక ఉన్నవారిని వదిలిపెట్టబోమని బాధిత కుటుంబాలతో అమిత్ షా స్పష్టం చేశారు. కాల్పులు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన అమిత్ షా ఆపై కాల్పులు జరిగిన ప్రాంతంలో ఏరియల్ సర్వే నిర్వహించిన ఆయన.. అధికారుల నుంచి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# ఊరిస్తున్న వాన్స్ టూర్



అమెరికా విధించబోయే సుంకాల గురించి మనతో సహా ప్రపంచమంతా బెంబేలు పడుతున్న వేళ, అక్కడ చదివే మన విద్యార్థులు, వృత్తిగత నిపుణులు వీసా సమస్యలతో సతమతమవుతున్న వేళ నాలుగు రోజుల వ్యక్తిగత పర్యటన కోసం ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుటుంబ సమేతంగా సోమవారం మన గడ్డపై అడుగుపెట్టారు. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఎంతో ఇష్టుడైన నేత కనుక ఆయన ద్వారా కొన్ని సమస్యలైనా పరిష్కారమవుతాయన్న విశ్వాసం మన దేశానికున్నట్టుంది. అందుకే కావొచ్చు... ప్రోటోకాల్స్ పక్కనబెట్టి మరీ ఆయనకు ఘనస్వాగతమిచ్చారు. మారిన పరిస్థితుల రీత్యా అమెరికాతో కొత్తగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం మన దేశానికి తప్పనిసరి. ఇప్పటికే ఆ విషయంలో ఇరు దేశాల మధ్యా సంప్రదింపులు సాగుతున్నాయి. ఒప్పందాలకు సంబంధించి అనుసరించాల్సిన విధివిధానాలు ఖరారయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన తర్వాత వాన్స్ ప్రకటించారు. దాదాపు 60 దేశాలపై సుంకాలను భారీ యెత్తున పెంచుతూ ఈ నెల 2 నుంచి అమల్లోకొస్తాయని ప్రకటించిన ట్రంప్, ఆ తర్వాత 90 రోజుల పాటు నిలిపివేశారు. కేవలం చైనాపై మాత్రమే అవి కొనసాగుతున్నాయి. పాత ఒప్పందాల స్థానంలో కొత్తవి కుదుర్చుకోవటం, తమకు మరింత మేలు కలిగేలా చేసుకోవటం ట్రంప్ ధ్యేయం. అందుకోసమే మూడు నెలల కొత్త గడువు విధించారు. నాలుగేళ్ల క్రితం రిపబ్లికన్ పార్టీకీ, ప్రత్యేకించి ట్రంప్‌కూ తీవ్ర వ్యతిరేకి అయిన జేడీ వాన్స్ ట్రంప్ తొలి దశ పాలనలోనే ఆయనకు మద్దతుదారుగా మారారు. గడచిన వంద రోజులుగా ఉపాధ్యక్షుడిగా ఆయన వ్యవహార శైలి గమనిస్తే రిపబ్లికన్ పార్టీలో ఆయన ముమ్మందు కీలకపాత్ర పోషించే అవకాశాలున్నాయని సులభంగానే చెప్పొచ్చు. ఆ మితవాద పక్షానికి ఆయన సరికొత్త స్వరంగా మారారు. ట్రంప్‌ను ఏయే అంశాల్లో ఇంతవరకూ వాన్స్ ఒప్పించారన్నది ఎవరికీ తెలి యదుగానీ... ఆయన విజన్‌ను తు.చ. తప్పకుండా పాటిస్తున్న నేతగా ఇప్పటికే నిరూపించు కున్నారు. మ్యూనిక్ భద్రతా సదస్సు సందర్భంగా ఉక్రెయిన్ యుద్ధం విషయంలో మారిన అమెరికా వైఖరిని నిక్కచ్చిగా చెప్పటంలో వాన్స్ విజయం సాధించారు. యూరప్ దేశాలు నొచ్చుకున్నా ఆయన ఖాతరు చేయలేదు. బ్రిటన్ విధానాలను దుయ్యబట్టారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని మందలిస్తున్న ట్రంప్‌తో గొంతు కలిపారు. గ్రీన్‌ల్యాండ్‌ను కొనితీరాలన్న ట్రంప్ అభిమతానికి అనుగుణంగా చెప్పాపెట్టకుండా కుటుంబ సమేతంగా వాన్స్ అక్కడికెళ్లారు. ప్రస్తుతం రక్షణ, విదేశీ వ్యవహారాలు డెన్మార్క్‌కు అప్పగించటం మినహా ఇతరత్రా స్వయం ప్రతిపత్తిని అనుభవిస్తున్న గ్రీన్‌ల్యాండ్‌కుగానీ, డెన్మార్క్‌కుగానీ ఈ ప్రతిపాదన ఇష్టం లేదు. ట్రంప్ మాదిరే స్వేచ్ఛా వాణిజ్యాన్ని, ఉదారవాద ఆర్థికవిధానాలనూ, భారీ వలసలనూ వాన్స్ తీవ్రంగా వ్యతిరేకిస్తారు. వాన్స్ అంటే వల్లమాలిన అభిమానం ఏర్పడటానికి ట్రంప్‌కు చాలా కారణాలున్నాయి. వాన్స్ లోని రచనా శక్తి అందులో ఒకటి. ఒకప్పుడు తనను 'అమెరికన్ హిట్లర్' అన్నా దాన్నంతటినీ మరిచి పోయే స్థాయిలో వాన్స్ ఆత్మకథాత్మక నవల 'హిల్‌బిల్లీ ఎలిజీ' ట్రంప్‌ను కట్టిపడేసింది. 2022లో ఆయనను ఒహాయో సెనెటర్‌ను చేయటమేగాక, అందరి అంచనాలనూ తలకిందులు చేస్తూ ఉపాధ్యక్ష అభ్యర్థిగా నిర్ణయించటానికి కూడా ఆ నవల ఉపకరించింది. శ్వేతజాతి అమెరికన్ జనాన్ని కూడగట్టడంలో, డెమాక్రాట్ల ఏలుబడిలో జరిగిన అన్యాయాలను ఏకరువు పెట్టడంలో ట్రంప్‌కు వాన్స్ నవల తోడ్పడిందని చెప్పాలి. పర్వత ప్రాంతాలను ఆనుకుని వుండే మారుమూల ప్రాంతాల్లో అక్షరాస్యతకూ, అభివృద్ధికీ దూరంగా వుండే శ్వేతజాతి అట్టడుగు వర్గాల జీవితాన్ని ఆ నవలలో వాన్స్ చిత్రీకరించారు. అరకొర పనులతో, అర్ధాకలి బతుకులతో వెళ్లబుచ్చే జనాలను నేరుగా చూసిన ఆ ప్రాంతవాసిగా వాన్స్ దాన్ని ప్రభావవంతంగా చెప్పగలిగారు. ఆ అట్టడుగు జనం గురించి ట్రంప్ ఎంత మాట్లాడినా నవలలో వాన్స్ చిత్రించిన జీవితానుభవం ట్రంప్‌కు లేదు. అది తెలుసుకున్నాక ఆయన మరింతగా ఆ వర్గంలోకి చొచ్చుకుపోగలిగారు. అందుకే కావొచ్చు... ట్రంప్‌కు వాన్స్ అంటే ప్రత్యేకాభిమానం ఏర్పడింది. అలాగని ఆయనను తన వారసుడిగా ప్రకటించదల్చుకోలేదు. మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేయటాన్ని రాజ్యాంగం నిరాకరిస్తున్నా, దాన్ని ఎలాగోలా మార్చి మరోసారి ఆ పీఠాన్ని అధిష్ఠించాలని ట్రంప్ కలలుగంటున్నారు. అదెంతవరకూ కుదురుతుందో భవిష్యత్తే తేల్చాలి. అసాధ్యమైతే మాత్రం ట్రంప్ మొదటి ఎంపిక వాన్సే కావొచ్చు. గత ఆర్థిక సంవత్సరంలో ఇరు దేశాల వాణిజ్యం విలువ 12,920 కోట్ల డాలర్లు. మన నుంచి అమెరికా నిరుడు 8,740 కోట్ల డాలర్ల సరుకును దిగుమతి చేసుకుంది. మూడు నెలల తర్వాత మనపై 26 శాతం సుంకాలు విధిస్తే అక్కడి మార్కెట్‌లో మన సరుకుల ధర పెరిగి డిమాండ్ పడి పోవచ్చు. అందుకే ద్వైపాక్షిక చర్చలు అత్యవసరమయ్యాయి. తమను నష్టపరిచే విధంగా అమె రికాతో ఎవరైనా ఒప్పందం చేసుకుంటే ప్రతిచర్యలు తీసుకోవాల్సి వస్తుందని చైనా హెచ్చరించగా... ఆ దేశంతో పరిమిత వాణిజ్యమే నెరపాలని ప్రపంచ దేశాలకు ట్రంప్ చెబుతున్నారు. ఇది ముదిరితే పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారొచ్చు. వర్తమాన అంతర్జాతీయ పరిస్థితుల్లో దౌత్యం తాడు మీది నడక లాంటిది. దాన్ని విజయవంతంగా పరిపూర్తి చేయటం అంత సులభమేం కాదు. గట్టిగా మాట్లాడి, అనుకున్నది సాధించటంలో మోదీకి మరెవరూ సాటిరారని వాన్స్ కితాబిచ్చారు. కుదరబోయే ఒప్పందాలు దాన్ని నిరూపిస్తే అంతకన్నా కావాల్సిందేముంది?

# మానవతావాది



మానవతావాదిగా పోప్ ఫ్రాన్సిస్‌ది సమకాలీన ప్రపంచంపై చెరగని ముద్ర. అందుకే ఆయన విలక్షణ వ్యక్తిత్వాన్ని ప్రశంసిస్తూ విశ్వవ్యాప్తంగా సంతాప సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఇటలీలో నియంత ముస్సోలిని అరాచకాలు భరించలేక అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్ వలస వచ్చిన ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన జార్జ్ మారియో బెర్గోగ్లియో నైట్‌క్లబ్ బౌన్సర్‌గా జీవితాన్ని ప్రారంభించారు. సొసైటీ ఆఫ్ జీసస్‌లో చేరి కాథలిక్ ప్రీస్ట్ నుంచి అత్యున్నత పోప్ పదవిని చేపట్టడానికి పేదల పట్ల కరుణ, దయ, వినమ్రతే ప్రధాన కారణం. అర్జెంటీనా నుంచి తొలుత బాధ్యతలు చేపట్టిన వ్యక్తిగా చరిత్రకెక్కిన ఆయన తన పేరును పేదల కోసం పాటుపడిన సెయింట్ ఫ్రాన్సిస్‌లోని ఫ్రాన్సిస్‌గా మార్చుకోవడం మానవత్వానికే తన ప్రాధాన్యత అని చాటిచెప్పడమే. విలాసవంతమైన రాజభవనాల్లో, అడుగడుగునా హంగు ఆర్భాటాలతో జీవించే మత పెద్దలందరికీ ఫ్రాన్సిస్ భిన్నం. జీవితాంతం నిరాడంబరతను చాటిచెబుతూనే ఉండటం ప్రత్యేకత. వృద్ధులు, ఖైదీల కాళ్లు కడిగి ముద్దుపెట్టుకోవడం అణగారిన వర్గాలకు సన్నిహితంగా, అండగా ఉండాలనే సందేశమే. వాటికన్‌లో తన తొలి ఈస్టర్‌కు ముందుగా ఇటలీ ద్వీపకల్పమైన లాంపెడుసాను ఎంపిక చేసుకోవడమే కాదు 88వ ఏట తీవ్ర అస్వస్థతతో ఉన్నా, తన మరణానికి ముందురోజున ఈస్టర్ నాడూ సామాన్యులను కలుసుకోవడం ఆయన విశిష్టత. యూరప్ చేరుకునేందుకు వేలాదిమంది శరణార్థులు ప్రవేశించే లాంపెడుసాను ఎంచుకోవడం ప్రపంచీకరణ పేదల పట్ల చూపే ఉదాసీనతకు నిరసన. ప్రమాదకరంగా సముద్ర ప్రయాణాలు చేస్తూ మరణిస్తుండటం పట్ల ఆందోళన. వాతావరణ మార్పుల వల్ల పేద దేశాలకు జరుగుతున్న అన్యాయానికి ధనిక దేశాలదే బాధ్యత అని కుండబద్దలు కొట్టిన, పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా బయటకు రావడాన్ని నిరసించిన మరో మత పెద్ద మనకు కనిపిస్తారా? అమెరికన్ కాంగ్రెస్‌లో ప్రసంగించిన తొలి పోప్ కూడా ఫ్రాన్సిసే. భూమిని, ప్రకృతిని, వాతావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రపంచంలోని అత్యంత ధనిక దేశానిదేనన్నారు. మెక్సికోకు వ్యతిరేకంగా సరిహద్దు గోడను ట్రంప్ తన తొలి విడత పదవీ కాలంలో నిర్మించడం క్రైస్తవ విరుద్ధమైన చర్య అంటూ ఖండించారు. ఇటీవల శరణార్థులను అమానవీయంగా సంకెళ్లు వేసి తరలించడంపైనా గళమెత్తారు. ప్రపంచ దేశాల మధ్య సయోధ్య, ప్రేమ, సత్సంబంధాల పెంపులోనూ ఆయన ముద్ర ఉంది. అమెరికా, క్యూబాల మధ్య చారిత్రక సయోధ్యకు, కొలంబియాలో శాంతికి తన వంతు ప్రయత్నాలు చేశారు. మత బోధకులు పిల్లల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడటంపై సమాజానికి క్షమాపణ చెబుతూనే వారి పట్ల, అవినీతికి పాల్పడిన వారి పట్ల కఠినంగా వ్యవహరించడం ఆయన ప్రత్యేకత. మతానికి చెడ్డపేరు వస్తుందనో, వారి పలుకుబడికి భయపడో అలాంటి ఘటనలను దాచిపెట్టాలని భావించే మత ఛాందసులకు ఆయన వైఖరి భిన్నం. మరణ శిక్షను, పచ్చి మితవాద భావజాలాన్ని నిరసించారు. యుద్ధాలను మానవతకు ఓటమిగా నిర్వచించడంతోపాటు మూడో ప్రపంచయుద్ధం తప్పదంటూ హెచ్చరించారు. డబ్బు కోసం మనుషులను కాల్చేసే వ్యాపారం అంటూ యుద్ధాలు చేసే దేశాలనూ, ఆయుధాలిచ్చే దేశాలనూ ఈసడించారు. యుద్ధాలు, అరాచకాల వల్ల కాందిశీకులుగా మారిన వారికి కాథలిక్ సంస్థల ద్వారా సహాయాన్ని అందించే ప్రక్రియను చేపట్టారు. ఇజ్రాయిల్, పాలస్తీనా, ఉక్రెయిన్ తదితర దేశాల అత్యున్నత స్థాయి బృందాలతో మాట్లాడి, యుద్ధాలను ఆపివేయాలంటూ శాంతి సందేశాన్నిచ్చారు. క్రైస్తవులు, ముస్లిముల మధ్య మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందీ ఆయనే. మహిళల హక్కుల కోసం గళమెత్తడంతోపాటు చేతల్లోనూ తెగువ చూపారు. రోమన్ కాథలిక్‌లలో ఉన్నత స్థానాల్లో పురుషులకే స్థానం కల్పించే సాంప్రదాయానికి స్వస్తి పలికి, అనేక మంది మహిళలకు ఉన్నత స్థానాలిచ్చారు. ఇటువంటి అనేక చర్యలను సాంప్రదాయ వాదులు తొలి నుంచీ నిరసిస్తూనే ఉన్నా ముందడుగేసిన చరిత్ర ఆయనదే. పేరు ప్రఖ్యాతులు, పోప్‌గా లభించే అధికారాన్ని అనుభవించడం కన్నా, సామాన్య ప్రజల కష్టసుఖాలు తనవిగా భావించి, సమాజానికి మేలు చేయాలని భావించిన ఆయన కాథలిక్ సమాజానికే కాదు, మత పెద్దలందరికీ ఆదర్శనీయం!

# స్మార్ట్‌ఫోన్లు, పీసీల తయారీ కేంద్రంగా భారత్

### అమెరికా – చైనాల మధ్య వాణిజ్య యుద్ధ ప్రభావం

### మనదేశం వైపు దృష్టి సారిస్తున్న అంతర్జాతీయ సంస్థలు

### కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక



ముంబై: అమెరికా–చైనా వాణిజ్య యుద్ధం భారత్‌కు అనూకూలంగా మారుతోంది. అంతర్జాతీయ స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాబ్‌లు/వ్యక్తిగత కంప్యూటర్ (పీసీలు) సంస్థలు తమ ఉత్పత్తి కర్మాగారాలను చైనా నుంచి భారత్‌కు తరలించే అంశాన్ని పరిగణలోకి తీసుకుంటున్నాయి. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక ప్రకారం అగ్రరాజ్యాల మధ్య సుంకాల విధింపులు, ప్రతీకార టారిఫ్‌ల ఉద్రిక్తతలు కొనసాగితే.., అంతర్జాతీయ స్మార్ట్‌ఫోన్ల మొత్తం ఉత్పత్తిలో డ్రాగన్ దేశపు వాటా 2026 నాటికి 55 శాతానికి పడిపోయే వీలుంది. గత సంవత్సరం(2024) ఈ వాటా 64 శాతంగా ఉంది. ఇదే సమయంలో భారత్ నుంచి ముఖ్యంగా అమెరికాకు యాపిల్, శాంసంగ్ ఎగుమతులు జోరందుకోనున్నాయి. అంతర్జాతీయ స్మార్ట్‌ఫోన్ల మొత్తం ఉత్పత్తిలో భారత్ వాటా 2026 నాటికి 25–28 శాతానికి చేరొవచ్చు. కాగా గత సంవత్సరంలో ఈ వాటా 18 శాతంగా ఉంది. అంతర్జాతీయంగా ఐఫోన్ల ఉత్పత్తి విలువలో భారత్ ఎగుమతుల వాటా ప్రస్తుతం 20 శాతంగా ఉంది. ఇది 2025–26 కల్లా 25 శాతానికి, 2026–27 నాటికి 35 శాతానికి చేరుతుందని కౌంటర్‌పాయింట్ అంచనా వేస్తోంది. ల్యాప్‌ట్యాబ్‌లు/ పీసీల మొత్తం తయారీలో చైనా వాటా 2026 నాటికి 68–70 శాతానికి దిగవచ్చే అవకాశం ఉంది. 2024లో ఈ వాటా 75 శాతంగా ఉంది. అంతర్జాతీయ ల్యాప్‌ట్యాబ్‌ల ఉత్పత్తిలో భారత్ వాటా 2026 నాటికి ఏడు శాతానికి చేరుకోవచ్చు. 2024లో భారత్ వాటా కేవలం నాలుగు శాతంగా ఉంది. "ల్యాప్‌ట్యాబ్‌లు, పీపీలు చైనా నుంచే అధికంగా దిగుమతి అవుతున్నాయి. వాణిజ్య వార్ నేపథ్యంలో హెచ్‌పీ, డెల్ ఇతర సంస్థలు తమ ఉత్పత్తి స్థావరాలు చైనా నుంచి భారత్‌కు మారిస్తే అంతర్జాతీయంగా దేశీయ మార్కెట్ వాటా పెరగడమే కాకుండా ఎగుమతులు సైతం గణనీయంగా పెరుగుతాయి. భారత్ సైతం ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంపై దృష్టి సారించింది. ఇప్పటికే ఐటీ హార్డ్‌వేర్ రంగాన్ని ప్రోత్సహించే దిశగా కేంద్రం 'మేక్ ఇన్ ఇండియా' 'ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం' వంటి పథకాలు ప్రవేశపెట్టింది" అని ఇండియన్ సెల్యూలర్ అండ్

**ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) సభ్యుడొకరు తెలిపారు.**

అంత సులువేం కాదు: చైనా నుంచి తయారీ కర్మాగారాలను భారత్‌కు తరలించడం అంత సులువు కాదని కాన్లేస్ నివేదిక చెబుతోంది. డెల్ సంస్థ ల్యాప్‌ట్యాబ్‌ల ఉత్పత్తి 79% చైనాలో ఉండగా, మిగిలినదంతా వియత్నాంలో ఉంది. కాన్లేస్ రిపోర్ట్ ప్రకారం 2026 నాటికి డెల్ తన తయారీ సామర్థ్యాన్ని సగానికిపైగా వియత్నాంకు తరలించనుంది. లెనివో సైతం వియత్నాంను ప్రత్యమ్నాయ దేశంగా చూస్తోంది. చైనాలో 85% తయారీ సామర్థ్యం ఉన్న హెచ్‌పీ.. 2026 కల్లా మెక్సికో, తైవాన్ దేశాలకు 45% మార్చనుంది.